# జ్ఞానసంస్కృతము

## (మూడవ భాగము)

గ్రంథకర్త :

యం. దేవదాసు అయ్యగారు

గుంటూరు - 2006 వెల. రూ/- 15.00

Bible Mission HQ Guntur

# విషయ సూచిక


| క్రమ సంఖ్య | | | పేజి నం: |
|---|---|---|---|
| 1. | బైబిలు తరగతి పాఠము | - | 1 |
| 2. | క్రీస్తుశక్తి | - | 8 |
| 3. | సిలువలు | - | 10 |
| 4. | విశ్వాస వాదము | - | 14 |
| 5. | ఋషుల దేశము | - | 20 |
| 6. | సువార్త ప్రచార ప్రార్థన | - | 22 |
| 7. | ఎరికో నీరు బాగుపడుట | - | 31 |
| 8. | విశ్వాసులకు సహాయము | - | 35 |
| 9. | దేవుని ప్రార్థించుడి | - | 39 |
| 10. | కుష్ఠురోగి బాగగుట | - | 41 |
| 11. | గొఱ్ఱెల కాపరి | - | 45 |
| 12. | సహింపు దానము | - | 48 |
| 13. | రక్షణ పత్రిక | - | 50 |
| 14. | రక్షణ పిలుపు | - | 58 |
| 15. | ప్రార్థనకోర్కె నెరవేర్చుకొను పద్ధతి | - | 64 |
| 16. | జెకర్యా మూగతనము | - | 66 |
| 17. | రక్షణ మహా సంకల్పన కథ | - | 71 |
| 18. | సంస్కార ప్రసంగము | - | 75 |
| 19. | యత్న యంత్రము | - | 79 |

# 1. బైబిలు తరగతి పాఠము

(బైబిలులోని 66 పుస్తకములలోనున్న అంశములు)

## పాతనిబంధన

1) ఇప్పుడు లోకములో నున్నటువంటి మంచివి అన్నియు దేవుడు మొదట ఎట్లు చేసినాడో అది **ఆదికాండములో** నున్నది.

2) దేవుని ప్రజలు బానిసత్వమును విడిపించుకొని ఎట్లు బయటికివచ్చినారో అది **నిర్గమ కాండము**లోనున్నది.

3) దేవుని ప్రజలు అరణ్యములో ఎట్లు దైవారాధన చేసిరో అది **లేవీయ కాండములో** నున్నది.

4) ఆరాధన శాలలో దేవుడు బోధించిన బోధ దేవుని ప్రజలు ఎట్లు వాడుకలో పెట్టిరో అదియును, ఎట్లు సేవచేసిరో అదియును, ఎట్లు తమ జనాంగమును లెక్కపెట్టినారో అదియును **సంఖ్యాకాండములో** నున్నది.

5) ఇదివరకు బోధించిన బోధలు దేవుడు మోషేద్వార ప్రజలకెట్లు జ్ఞాపకము తెచ్చెనో అది **ద్వితియోపదేశ కాండములో** నున్నది.

6) దేవుడు తన జనమునకు యెహోషువాద్వార పాలెస్తీనా దేశమును ఎట్లు పంచిపెట్టెనో అది **యెహోషువ గ్రంథములో** నున్నది.

7) తన ప్రజలు ఎన్నో పర్యాయములు పాపములో పడిపోగా దేవుడు వారిని శిక్షించుచు, ఎట్లు న్యాయాధిపతులద్వారా రక్షించెనో అది **న్యాయాధిపతుల గ్రంథములో** నున్నది.

8) ఏ అన్యురాలియొక్క వంశములో యేసుప్రభువు జన్మించవలెనో ఆ అన్యురాలైన రూతు అనే భక్తురాలి చరిత్ర **రూతు గ్రంథములో** నున్నది.

9) దేవుని ప్రజల రాజ్యము ఎట్లు స్థాపింపబడినదో అది **మొదటి సమూయేలు గ్రంథములో** నున్నది.

10) ఆ రాజ్యములో కొంత పని ఎట్లు జరిగెనో అది **రెండవ సమూయేలు గ్రంథములో** నున్నది.

11) ఆ రాజ్యము ఎట్లు స్థిరపడెనో అది **మొదటి రాజుల గ్రంథములో** నున్నది.

12) ఆ రాజ్యము ఎట్లు మహోన్నత స్థితిలోనికి వచ్చెనో అది **రెండవ రాజుల గ్రంథములో** నున్నది.

13) ఆ రాజ్యముయొక్క చరిత్ర అదివరకున్న చరిత్రకంటె వేరుగా యెహోవా రాజైయున్నాడనునదియును **మొదటి దినవృత్తాంత గ్రంథములో** నున్నది.

14) ఆ రాజ్యము ఎట్లు కొనసాగెనో అదికూడ వేరే రీతిగా **రెండవ దినవృత్తాంత గ్రంథములో** నున్నది.

15) చెరలోనుండి తిరిగివచ్చిన వారికి ఎజ్రా ఎట్లు దైవబోధ వినిపించెనో అది **ఎజ్రా గ్రంథములో** నున్నది.

16) పడిపోయిన దేవాలయము నెహెమ్యా ఎట్లు కట్టించెనో అది **నెహెమ్యా గ్రంథములో** నున్నది.

17) దేవుడు తన ప్రజలను నరహత్యనుంచి ఎట్లు తప్పించెననో అది **ఎస్తేరు గ్రంథములో** నున్నది.

18) మానవుడు శ్రమలు అనుభవిస్తేనేగాని దైవభక్తి వెల్లడిలోకి రాదు అని **యోబు గ్రంథములో** నున్నది.

19) అన్ని విషయములలో నిత్యము దేవునిని ఎట్లు స్తుతించవలెనో అది **కీర్తనల గ్రంథములో** నున్నది.

20) జ్ఞానము ఎట్లు సంపాదించుకొనవలెనో అది **సామెతల గ్రంథములో** నున్నది.

21) లోకములో ఉండే సమస్త సుఖములు వ్యర్థమేగాని ఒక్క దైవభక్తిమాత్రమే మానవులకు ఉపయోగకరమని **ప్రసంగిలో** నున్నది.

22) సంఘమునకు దేవునికిని ఉన్న సహవాసమును గురించి **పరమ గీతములో** నున్నది.

23) క్రీస్తుప్రభువుయొక్క చరిత్ర యావత్తును ప్రవచన రూపముగా **యెషయా గ్రంథములో** నున్నది.

24) చెరలోకివెళ్ళిపోగా యెరూషలేములో మిగిలిపోయిన యూదులమధ్యను దైవ చిత్తమును, తీర్పును యిర్మీయా వినిపించిన సంగతి **యిర్మీయా గ్రంథములో** నున్నది.

25) శ్రమలోనుండి శ్రమను ఒకరు వివరించిన సంగతి **విలాపవాక్యముల గ్రంథములో** నున్నది.

26) చెరలోనున్న యూదులకు దేవుని చిత్తమును యెహెజ్కేలు బయలు పరచిన సంగతి **యెహెజ్కేలు గ్రంథములో**నున్నది.

27) రాబోవు కాలములో అంతి క్రీస్తు పరిపాలన ఉండుననియు, మెస్సీయా లోకమంతటిని ఏలుననియు దానియేలు ప్రవచించిన ప్రవచనములు **దానియేలు గ్రంథములో** నున్నవి.

28) దేవుని ప్రజలు భ్రష్టులైనందువల్ల దేవుడే స్వయముగా వారికొరకు వార్తపంపి నాయొద్దకు తిరిగి రావలెనని చెప్పినట్టు **హోషేయ గ్రంథములో** నున్నది.

29) అంత్య దినములయందు దేవుడు తన ఆత్మను అందరిమీద కుమ్మరించునని **యోవేలు గ్రంథములో** నున్నది.

30) ఇతర జనాంగముల వారికిని దేవుని ప్రజలకును వారి వారి పాపస్థితినిబట్టి శిక్ష లభించుననియు, మార్పు పొందినవారు చేర్చుకొనబడుదురనియు **ఆమోసు గ్రంథములో** నున్నది.

31) ఎదోము (ఏశావు) తన సహోదరునికి విరోధియైనందున శిక్ష కలుగుననియు, ఇతరులకు అపకారముచేసిన వారికి అపకారము కలుగుననియు **ఓబద్యా గ్రంథములో** నున్నది.

32) యూదులకు దేవుడు అయియున్న దేవుడు అన్యులకుకూడ దేవుడే గనుక వారికీ సంగతి చెప్పుము అని **యోనా గ్రంథములో** నున్నది.

33) దేవునివంటి క్షమాపణ కర్త మరియొకరు లేరు అని **మీకా గ్రంథములో** నున్నది.

34) దైవ ద్వేషకులకు గొప్ప హాని అనియు, పశ్చాత్తాపపడు వారికి ఆదరణ కలుగుననియు **నహూము గ్రంథములో**నున్నది.

35) దేవుడెందుకు లోకములో కీడు జరుగనిచ్చుచున్నాడో ఆసంగతియును ఎన్ని కష్టాలున్నను దేవునియందు ఆనందించుట మానకూడదనియు **హబక్కూకు గ్రంథములో** నున్నది.

36) దేవుడు ఎంత ప్రేమగలవాడైనప్పటికిని పాపమును పాపకార్యములను అసహ్యించుకొను దేవుడనియు పాపముమానువారికి రక్షణ దయచేయుననియు **జెఫన్యా గ్రంథములో**నున్నది.

37) ఇప్పటి దేవాలయములకంటె భావికాలమందు మహా మహిమగల దేవాలయము లేచునని **హగ్గయి గ్రంథములో** నున్నది.

38) పూర్వికులు పాపస్థితిలో ఉన్నందున వారికి హాని కలిగినది. మనకట్లు కలుగకుండు నిమిత్తమై జాగ్రత్తగానుందము అని జ్ఞాపకము తెచ్చిన సంగతి **జెకర్యా గ్రంథములో** నున్నది.

39) మీ పాపములను గురించి పశ్చాత్తాపపడండి, యెహోవా తట్టు తిరుగండి అని **మలాకీ గ్రంథములో** నున్నది.

## క్రొత్త నిబంధన

40) యేసుప్రభువు రాజైయున్నాడని **మత్తయి సువార్త**లో నున్నది.

41) యేసుప్రభువు సేవకుడైయున్నాడని **మార్కు సువార్తలో** నున్నది.

42) యేసుప్రభువు అచ్చమనిషై యున్నాడనియు, మనిషికంటె ఎక్కువైన వ్యక్తి అనియు **లూకా సువార్త**లో నున్నది.

43) యేసుప్రభువు దేవుడని **యోహాను సువార్తలో** నున్నది.

44) మేము యేసు ప్రభువును చూచిన సాక్షులమైయున్నామని శిష్యులు కనబరిచిన సాక్ష్యము **అపోస్తులుల కార్యములలో** నున్నది.

45) నీతిమంతుడు విశ్వాసమువల్ల జీవించును క్రియలవల్లకాదు అని **రోమా పత్రికలో** నున్నది.

46) యేసు ప్రభువైయున్నాడు అనియు, సంఘములో దిద్దుబాటు జరిగినదనియు **మొదటి కొరింథి పత్రికలో**నున్నది.

47) సంఘమునకు కావలసిన పరిచర్య జరుగవలెనని **రెండవ కొరింథి పత్రికలో**నున్నది.

48) క్రీస్తు ప్రభువు సంఘమునకు స్వేచ్ఛ అనుగ్రహించునని **గలతీ పత్రికలో** నున్నది.

49) సంఘము క్రీస్తుయొక్క శరీరము అని **ఎఫెసీ పత్రికలో**నున్నది.

50) క్రైస్తవుల ఐక్యత ఎన్నికష్టములున్నను విడిపోగూడదని **ఫిలిప్పీ పత్రికలో** నున్నది.

51) క్రీస్తుప్రభువు సంఘమునకు శిరస్సైయున్నాడని **కొలస్సయులకు పత్రికలో** నున్నది.

52) క్రీస్తుప్రభువు మేఘాసీనుడై తన సజీవుల సంఘము కొరకు వచ్చునని **మొదటి థెస్సలోనికై** పత్రికలోనున్నది.

53) క్రీస్తుప్రభువు భూమిమీదికి తన వారితో వచ్చును. (హర్మగెద్దోను) అని **రెండవ థెస్సలోనికై** పత్రికలోనున్నది.

54) సంఘ పరిపాలన విషయములు **మొదటి తిమోతి పత్రికలో** నున్నవి.

55) శ్రమ కాలములో ప్రభువు యెడలగల అభిమానము పోగొట్టుకొనరాదని **రెండవ తిమోతి పత్రికలో** నున్నది.

56) సంఘమునకు క్రమమైన నడవడిక ఉండవలెను. అని **తీతు పత్రికలో** నున్నది.

57) పశ్చాత్తాపపడు వారిని క్షమించి చేర్చుకొనవలెనని **ఫిలేమోను పత్రికలో** నున్నది.

58) యేసుప్రభువు అందరికన్న శ్రేష్టుడని **హెబ్రీపత్రికలో**నున్నది.

59) విశ్వాసమున్న లాభమేమి? క్రియలు లేనప్పుడు అని **యాకోబు పత్రికలో**నున్నది.

60) ప్రభువు నిమిత్తము శ్రమలు పడుట మేలు అని **మొదటి పేతురు పత్రికలో**నున్నది.

61) భ్రష్టత్వ కాలమందును పవిత్రులమై యుండవలెనని **రెండవ పేతురు పత్రికలో**నున్నది.

62) దేవునితో సహవాసము కలిగియుండవలెనని **మొదటి యోహాను పత్రికలో**నున్నది.

63) సత్యమును అంగీకరించి దానికి విధేయులమై యుండవలెనని **రెండవ యోహాను పత్రికలో**నున్నది.

64) సంఘములో అతిధి సత్కారము కలిగియుండవలెనని **మూడవ యోహాను పత్రికలో** నున్నది.

65) తొట్రిల్లకుండా జాగ్రత్తగా నుండవలెను. రెండవ రాకకు ముందు లోకముయొక్క దుస్థితి ఎట్లుండునో ఆ సంగతి **యూదా పత్రికలో**నున్నది.

66) తుదకు క్రీస్తుకును, ఆయన భక్తజన సంఘమునకు ఎట్లు కడవరి జయము కలుగునో ఆ సంగతియు, ఆటంకపరులకు అపజయమెట్లు కలుగునో ఆ సంగతియు **ప్రకటన గ్రంథములో** నున్నది.

# 2. క్రీస్తు శక్తి

1. యేసుక్రీస్తు ప్రభువు దేవుడుగా **కనబడని ప్రత్యక్షత గలదా?** యోహాను 20:28; రోమా 9:5.
2. ఆయన అసలైన మానవుడుగా **అగుపడని నరావతారము గలదా?** హెబ్రీ. 2:16.
3. ఆయన **నివసింపలేని స్థలము గలదా?** యోహాను 1:1.
4. ఆయన **తీర్చజాలని అక్కరగలదా?** యోహాను 6:12.
5. ఆయన **ధర్మము చేయనేరని ధనధాన్యాదులు గలవా?** మత్తయి 6:31-33.
6. ఆయన **నేర్పలేని విద్యగలదా?** యాకోబు 1:5.
7. ఆయన **వినలేని ప్రార్థన గలదా?** లూకా 18:1-8.
8. ఆయన **అనుగ్రహింపలేని వరము గలదా?** మత్తయి 10:1.
9. ఆయన **క్షమింపలేని పాపము గలదా?** 1యోహాను 1:7.
10. ఆయన **నిర్మూలము చేయలేని పాపఫలితము గలదా?** 1పేతురు 2:21-22; మార్కు 1:40-45.
11. ఆయన **విజయశక్తి ఇయ్యలేని పాపాకర్షణ గలదా?** యోహాను 11:25-27.
12. ఆయన **వెళ్ళగొట్టలేని దయ్యముగలదా?** మత్త 8:28-33.
13. ఆయన **రాకుండ చేయలేని మరణభీతి గలదా?** మత్త. 8:23-27.
14. ఆయన **కలిగింపలేని పరిశుద్ధత గలదా?** ఎఫెసీ. 5:27.
15. ఆయన **తొలగింపలేని కీడుగలదా?** మార్కు 10:27.
16. ఆయన **కోరుకొనని నరుడు గలడా?** యోహాను. 17:24-26.

17. ఆయన **వాడుకొనలేని వస్తువు గలదా?** మత్తయి 17:24-27.
18. ఆయనకు **తెలియని మానవ కష్టస్థితి గలదా?** హెబ్రీ 4:15.
19. ఆయన మనకు **చేయలేని సహాయము గలదా?** మార్కు 7:37.
20. ఆయన **మనలను నడిపింపలేని మోక్షము గలదా?** యోహాను 14:3.

మీరు ఆయనను నమ్మినయెడల సమస్త విషయములలోను మీకు సర్వ సహాయకారిగా నుండును. మన విషయమై భూమిమీద వెలసి మానవుల ఉపయోగార్ధమైన పనులు చేయుచు తనకు తానే మరణమునకు లోనై మన పాపపరిహారార్ధమైన రక్తమును చిందించి బ్రతికివచ్చి నిత్య జీవరక్షకుడనిపించుకొని మోక్షలోకమునకు వెళ్ళి తన భక్తులను తీసికొని వెళ్ళుటకు త్వరలో రానైయున్న యేసుక్రీస్తు *ప్రభువు ఏమి చేయలేడు?*

"నా నామమునుబట్టి మీరు నన్నేమి అడిగినను నేను చేతును" అని యేసుప్రభువు వాగ్ధానమిచ్చియున్నాడు. యోహాను 14:14.

చదువరులారా! ఈ మాటలలోనుండి మీకు గొప్ప దీవెనలు కలుగునుగాక! ఆమేన్.

# 3. సిలువలు

సిలువ అనగా శ్రమ బాధ అవమానము. అన్నివిధములైన శ్రమలను సిలువలని చెప్పవచ్చునుగాని బైబిలులో దేవునిబట్టి వచ్చిన శ్రమలకు సిలువలు అను అంతరార్థము కలదు. క్రీస్తుప్రభువు కర్రసిలువ మోసెను. సిలువమీద ఆయన పడినబాధ మరియొక సిలువ.

1. క్రీస్తుప్రభువు దేవుడైనను మననిమిత్తమై నరుడుగా జన్మించెను. ఆయనకు ఇదెంత [1]న్యూన్యత! ఇది మొదటిసిలువ. ఫిలిప్పీ 2:6-7.
2. కన్య మరియ సృజింపబడుటకు కారకుడైన యేసుప్రభువు ఆమెయందు జన్మించెను. ఆయనకు ఇదెంత బిడియముగా నుండవలసినస్థితి! ఇది రెండవ సిలువ. గలతీ. 4:5.
3. యేసుప్రభువే తల్లిదండ్రులను పోషింపవలసిన దేవుడు, గాని వారే ఆయనను పోషించిరి. ఆయనకే వారు లోబడవలసినవారు గాని ఆయనేవారికి లోబడెను. ఆయనకు ఇదెంత బీదస్థితి! ఆయనకు ఇదెంత దీనస్థితి! ఇది మూడవ సిలువ. లూకా. 2:51.
4. "లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లగా" ప్రభువు వచ్చినను "లోక మాయనను తెలిసికొనలేదు". ఆయనకు ఇదెంత నిరాశకరమైన స్థితి! ఇది నాల్గవ సిలువ. యోహాను. 1:29; యోహాను. 1:10.
5. ఏర్పాటు ప్రజలైన యూదులు ప్రభువునకు స్వకీయులు. వారైనను ఆయనను "అంగీకరింపలేదు" ఆయనకు ఇదెంత పరాభవము! ఇది అయిదవ సిలువ. యోహాను. 1:11.

---

1. న్యూన్యత అనగా కొఱత.

6. యూదులకొరకై మోషే వ్రాసిన ధర్మశాస్త్రమును యేసు ప్రభువు నూతనముగా బోధించుచు కృపాశాస్త్రమును ప్రవేశపెట్టినపుడు యూదులు నిరాకరించిరి. ఆయనకు ఇదెంత అవమానము! ఇది ఆరవసిలువ. యోహాను. 1:17.

7. పాపములు క్షమించిన దేవప్రభువునుచూచి యూదులు ఇది దేవుడు చేయవలసినపనిగాని నరుడు చేయవలసిన పనిగాదు అని తలంచిరి. ఈయన నరుడనియే కాని దేవుడని వారు గుర్తించలేదు. ఆయనకు ఇదెంత చిన్నతనము! ఇది ఏడవ సిలువ.

8. ప్రభువు రోగులను బాగుచేసినప్పుడు యూదులు సంతోషించుటకు బదులుగా సబ్బాతుదినమున చేసినాడని ఆక్షేపించిరి. ఆయనకు ఇదెంతనింద! ఇది ఎనిమిదవ సిలువ. లూకా. 13:14.

9. ప్రభువు భూతపీడితులలోనున్న దయ్యములను వెళ్ళగొట్టినపుడు యూదులు పిశాచిశక్తివలన వెళ్ళగొట్టుచున్నాడని అపార్థము చేసికొనిరి. ఆయనకు ఇదెంత కోత! ఇది తొమ్మిదవ సిలువ. మత్తయి. 12:24.

10. ప్రభువు అందరితోను కలిసిమెలసినవాడై పాపులతోను సుంకరులతోను భోజన పంక్తిని కూర్చున్నందులకు యూదులు ఆయనమీద నెపముమోపిరి. ఆయనకు ఇదెంతబాధ! ఇది పదియవ సిలువ. లూకా. 15:1.

11. మృతినొందిన లాజరును ప్రభువు బ్రతికించినందులకు యూదులు లాజరును, ప్రభువును చంప యత్నించిరి. ఆయనకు ఇదెంత ఘోరమైన అవమానము! ఇది పదునొకండవ సిలువ. యోహాను. 11:53; 12:11.

12. శిష్యులకు యేసుప్రభువు మూడేండ్లు బోధించినను వారిలో నొకడైన ఇస్కరియోతుయూదా ఉరిపెట్టుకొని చచ్చిపోయెను. ఆయనకు ఇదెంత మనో వేదన! ఇది పన్నెండవ సిలువ. మత్తయి. 27:5.

13. ప్రభువును శత్రువులు పట్టుకొన్నప్పుడు శిష్యులు పారిపోయిరి. ఆయనకు ఇదెంత అపకీర్తి! ఇది పదమూడవ సిలువ. మత్తయి. 26:56.

14. కఱ్ఱసిలువమీద ఆయనపడినబాధ గొప్పసిలువ. ఇది మనము గ్రహింపలేని బాధ. లోక పాపములను మోసికొన్న మోపు ఎంత బరువైయుండునో ఆలోచించండి. ఎంత బాధకలిగించినదై యుండునో యోచించండి. ఆయనకు ఇదెంత ఊపిరి ఆడని **ఆయాసము!** "అక్రమకారులలో ఒకడుగా ఆయన ఎంచబడెను". **వీడు ఇతరులను** రక్షించెను. వీడు దేవుడేర్పచుకొనిన క్రీస్తు అయినయెడల తన్నుతాను రక్షించుకొనునని అపహాసించిరి." ఆయనకు ఇదెంత హేళనపదము! ఇది పదునాల్గవ సిలువ. లూకా. 22:37; 23:35.

15. దేవుడు నరుడైనాడు. కాబట్టి ఆ నరశరీరమునకు సమాధి చేసిరి. ఇది ఆకాలపు భక్తులు ఎంతగా విలపించి నిరాశలోనికి దిగిపోవలసిన చరిత్రాంశము! ఆయన బ్రతికి రానియెడల లోకమును రక్షింపలేడు. నేను బ్రతికిరాగలనో రాలేనో అని ఆయన అనుకున్న యెడల అది ఎంత గొప్ప సిలువయై యుండును! ఆయన బ్రతికిరాడు అని అనుకొనుట మనుష్యస్వభావమునకు సరిపోవును. విశ్వాసికి సరిపోదు. విశ్వాసులట్లనుకొన్నారు. ఆయనకు ఇదెంత కష్టతరమైన సిలువ!

ఇది పదునైదవ సిలువ.

షరా:- యేసుక్రీస్తు ప్రభువు శరీరధారియైయున్న దినములలో మహారోధనముతోను, కన్నీళ్ళతోను, తన్ను మరణమునుండి రక్షింపగలవానికి ప్రార్థనలను, యాచనలను సమర్పించి భయభక్తులు కలిగియున్నందున ఆయన అంగీకరింపబడెను అని హెబ్రీ. 5:7లో వ్రాయబడియున్నది. ప్రభువు అనుభవించిన సిలువలు పదిహేనేకాదు. అనేకములు. ఆయన జీవిత కాలమంతయు దించివేయని ఒక గొప్ప సిలువయైయున్నది. యేసు ప్రభువు సిలువమీద ఉన్నప్పుడు ఎవరెవరిని తలంచుకొనెనో!

మన నిమిత్తమై శ్రమలపాలై తన ప్రేమను వెల్లడించిన ప్రభువునకు మనము సదా కృతజ్ఞతాస్తుతులు ఆచరించిన యెడల ఆయనకెంత సంతోషము!!!

ఇవి ధ్యానించువారికి ఇంకను అనేకమైన సిలువలు కనబడును.

ఆయన సిలువ మన శరీరాత్మలకు చలువ దయచేయును గాక! ఆమేన్.

# 4. విశ్వాస వాదము

ఆది. 24:13,14; 19:18-22; లూకా. 10:1; మత్త. 10:1.

విశ్వాసముయొక్క వాదమును వినగోరువారలారా మీకు శుభము కలుగునుగాక! విశ్వాసము దేవునితో వాదించునది. ఏది దేవునితో వాదించునో అదే విశ్వాసము. అనగా దేవునియొక్క వాగ్దానములు ఆయనకే చూపించి వాదించుట. అది విశ్వాసముయొక్క పని. బైబిలు అంతటిలో రెండు ముఖ్యమైన అంశములు గలవు.

1. దేవుడు తన ఇష్ట ప్రకారము తన పనులు మనుష్యుల ద్వారా చేయించుట. దేవుడు తన ఏర్పాటు ప్రకారము చేయుట. ఇది ఒక పద్ధతి.

2. దేవుడు మనుష్యులయొక్క ఇష్టప్రకారము చేయుట అనగా మనుష్యులయొక్క ఏర్పాటు ప్రకారము దేవుడు చేయుట. ఇది రెండవ పద్ధతి.

ఈ రెండు పద్ధతులు బైబిలులో గలవు. ఈ రెండు దేవుడు చేయు పనులేగాని ఏర్పాటులు వేరు.

**ప్రభువుయొక్క ఏర్పాటు:-** 1. యేసుప్రభువు శిష్యులను, ఇతరులను 70 మందిని పిలిచి, మీరు ఆయా గ్రామములకు వెళ్ళి సువార్త ప్రకటించుడి అని తన ఏర్పాటును, తన ఇష్టము నెరవేర్చుటకు వారిని పంపెను. మత్తయి 10:1; లూకా 10:1. వారు మారుమాట్లాడుటకు వీలులేదు. ఎందుకనగా అది వారికి ప్రభువుయొక్క ఏర్పాటు. అది ప్రభువుయొక్క ఇష్టము గనుక వారు తప్పక చేయవలెను.

2. ఆయన మరియొక ఏర్పాటు చేసెను. మీరు సర్వసృష్టికి సువార్త ప్రకటించుడని ఆజ్ఞాపించెను. అదికూడ దేవుని ఇష్టము, దేవుని ఏర్పాటు. ఆయన ఇష్టప్రకారము, ఆయన ఏర్పాటు ప్రకారము శిష్యులు చేయవలెను.

**మనుష్యుని ఏర్పాటు:-** మానవునియొక్క ఇష్టము, అతనియొక్క ఏర్పాటు. ఇదికూడ దేవుడే నెరవేర్చవలెను. గాని ఇష్టము, ఏర్పాటు మానవునిది- అదే భేదము. ఆది 24:13,14వచనములలో ఎలియాజరు నూతిదగ్గర ఉండెను. తన ఇష్టము ప్రభువుతో చెప్పుచున్నాడు. ప్రభువా! 'నీ ఇష్టమేమిటి' అని అడుగలేదు. గాని 'నా ఇష్టప్రకారము' చేయుము అని అడుగుచున్నాడు. 'ఏ చిన్నది నాకు నా ఒంటెలకు నీళ్ళు పోయునో ఆ చిన్నదే నా యజమానుని కుమారుడైన ఇస్సాకునకు భార్య అగును' అని తన ఇష్టము ప్రభువుతో చెప్పుచున్నాడు. అమ్మాయి కొరకు వెతకి వెతకి దేవా నీ చిత్తము నెరవేర్చుము అని ప్రభువుతో చెప్పవలెను. తీరా కన్యక రిబ్కా వచ్చినది గనుక కథ నెరవేరినది. మరియొక స్త్రీ వివాహము అయిన ఆమె ఎదురు వచ్చినయెడల ఎంత ఆటంకము కలుగును? ఎలియాజరునకు ఆలాగు దేవుడు చేయడని తెలియును. తాను అడిగినది తన ఇష్ట ప్రకారము, తన ఏర్పాటు ప్రకారము ప్రభువు చేయును అనే గొప్ప విశ్వాసము గలదు. ఎందుచేత అతనికి అట్టి విశ్వాసము గలదు? విశ్వాసులకు తండ్రియైన అబ్రాహాము ముందె చెప్పియున్నాడు. ఆది. 24:40 "నీతోకూడ తన దూతను పంపి నీ ప్రయాణము సఫలము చేయును." విశ్వాసులకు తండ్రియైన అబ్రాహాముయొక్క విశ్వాసము తుదకు ఎలియాజరుయొక్క విశ్వాసమాయెను. దేవుడు ఈ ఎలియాజరు ప్రార్థన ప్రకారము రిబ్కానే పంపి తనకును ఒంటెలకును నీళ్ళు పోయించెను.

మరియొక చిత్రము ఏమనగా నీళ్ళు పోసినందున ఎలియాజరు పెద్దల సలహా లేకుండా ఆమెకు నూతి దగ్గరే నగలు పెట్టెను. ఇది తన ఏర్పాటే. పెండ్లి ఏర్పాటు చేసికొనిన తర్వాత నగలు

ఇచ్చిన బాగుండును. నీళ్ళు పోసినందుకు ఆ నగలు పెట్టినాడు. గాని తుదకు అవే పెండ్లి నగలు అయినవి. గనుక దేవుడు మన ఇష్టముకూడ నెరవేర్చును. మన విశ్వాసమునుబట్టి చేయును గనుక నేటి మన ప్రసంగాంశము “విశ్వాస వాదము”.

మార్కు 5:22-43లో యాయీరు కథలో అతడు ప్రభువును తన ఇంటికి రమ్మని పిలిచెను. అది యాయీరుయొక్క ఏర్పాటు, ఇష్టము. ఆయన ఏర్పాటు కాకపోయిన ప్రభువు యాయీరు ఏర్పాటు ప్రకారము వెళ్ళి చనిపోయిన కుమార్తెను బ్రతికించెను. బ్రతికించుట కూడ యాయీరు ఏర్పాటే గనుక ప్రభువు అట్లే బ్రతికించెను. దీనినిబట్టి కూడ ప్రభువు మనిషి ఇష్టప్రకారము చేయునని కనబడుచున్నది. ఆది 19:18-22లో భక్తుడైన లోతు దేవదూతలను అడిగెను. దూతలు అతనిని “ఆ పర్వతమునకు పారిపొమ్ము” అని చెప్పిరి. అందుకు లోతు వారితో నేను అంత దూరము నడవలేను, ముసలివాడను. దగ్గరనున్న గ్రామమునకు వెళ్ళెదను అని మనవి చేయగా ఆ దూతలు అతనినిబట్టి ఆ ఊరును నాశనము చేయము అని చెప్పిరి. ఆ ఊరు లోతుయొక్క ఇష్టము, ఏర్పాటు గనుక అక్కడికి వెళ్ళుమని పలికిరి. గనుక మన ఇష్ట ప్రకారము ప్రభువు చేయుట అనేది గలదు. గనుక గుడికి వచ్చిన వారందరు మీ ఇష్టము, మీ ఏర్పాటు, విశ్వాసమును బట్టి ప్రభువునడిగి చెప్పండి- దేవుని ఇష్టమును, దేవుని ఏర్పాటును ఏలాగైన నెరవేరును, గాని మనిషి ఇష్టము మనిషి ఏర్పాటు విశ్వాసమునుబట్టి ఉండును. ఆ విశ్వాసము వాగ్ధానమునుబట్టి ఉండును. ఈ వాగ్ధానమును బట్టి మనిషియొక్క ఏర్పాటు నెరవేరును.

**వాగ్ధాన దృష్టాంతము:-** మత్త. 9:27-31లో ఇద్దరు గుడ్డివారు ప్రభువు దగ్గరకు వెళ్ళిరి. ప్రభువు మీకేమి కావలెను అని అడుగగా

వారు తమ ఇష్టము కోరిరి. చూపు కావలెను అని జవాబిచ్చిరి. ఇది చేయగలనని నమ్ముచున్నారా అని ప్రభువు ప్రశ్నించెను. వారు 'నమ్ముచున్నాము ప్రభువా' అనిరి. అప్పుడు క్రీస్తుప్రభువు మీ నమ్మిక చొప్పున మీకు కలుగును గాక అని చెప్పిరి. అది వాగ్ధానము, ఆ వాగ్ధానమే ఆశీర్వాదము. ఆ ఆశీర్వాదమే నెరవేర్పు. ఈ మూడు ఏకము కాగా వారికి కండ్లు వచ్చెను. ఈ స్వస్థత వారి ఇష్టప్రకారము కలిగెను. గనుక దేవుడు మన ఇష్టప్రకారముకూడ ఆయన వాగ్ధానమునుబట్టియు, మన విశ్వాసమునుబట్టియు నెరవేర్చును. ఎప్పుడు ప్రభువు "మీ నమ్మిక చొప్పున మీకు కలుగునుగాక" అని అనిరో అప్పుడు వారి వారి మనసులలో 'ఆమెన్' అన్నారు. "కలుగునుగాక" అనునది గొప్ప వాగ్దానము. గనుక నెరవేరినది. గనుక దేవుడు మన ఇష్టప్రకారము కొన్ని నెరవేర్చును- ఇవి బైబిలులోని దృష్టాంతములు.

**స్వంత అనుభవము:-** (1) ప్రభువా! నా పాపములు క్షమించుము అని ప్రార్థనచేసినపుడు దేవుడు నెరవేర్చునా? బైబిలులో వాగ్దానములున్నవా? పాపములు క్షమింతును అను వాగ్దానములు కావలసినన్ని గలవు. దేవుడు పాపములు క్షమింపక పోయిన యెడల మన ఇష్టాలు, మన ఏర్పాట్లు ఎన్ని నెరవేర్చిన ఏమి లాభము? జీవాంతమందు ఏమియు లాభములేదు. ఇంకను క్షమించబడలేదు. అని ఎవరికైన సందేహమున్నయెడల, వారు ఒప్పుకొని ఎన్నటికి తప్పుచేయను అని ప్రమాణము చేయవలెను. ప్రమాణము గట్టిదైన క్షమించుటకూడ గట్టిదగును. యెషయాలో పాపములు కప్పివేతును. అవతల పారవేతును, ఎప్పుడు జ్ఞాపకము చేసికొనను. నీ పూచీ అయిపోయింది, జ్ఞాపకము తెచ్చుకోను అని దేవుడు చెప్పుచున్నాడు.

అయితే నీవు ఎందుకు జ్ఞాపకము తెచ్చుకొనవలెను? అది బాగుగాలేదు. నేనే జ్ఞాపకము తెచ్చుకొనను అన్నప్పుడు నీవెందుకు జ్ఞాపకము తెచ్చుకొనవలెను? అని ప్రభువు అడుగుచున్నాడు.

(2) ఓ ప్రభువా! మా ఇంటిలో ఒకరికి చాల జబ్బుగా నున్నది. నీ వాగ్దానము నమ్ముచున్నాను. ప్రభువా! నీవు గుడ్డివారితో అన్నట్లు 'నా నమ్మికచొప్పున నాకు కలుగుగాక' అని ప్రార్థించిన ఆ వ్యాధి పోవును. ప్రభువు ఆ గుడ్డివారితో నేను నీ కండ్లు బాగుచేయుదును అని అనలేదుగాని ఆయన బాగుచేయుట నిజమే, అయితే ఆయన ఆ మాట పలుకకుండా 'మీ నమ్మిక చొప్పున మీకు కలుగుగాక' అని చెప్పెను. బాగుచేయువారు ప్రభువే గాని, నమ్మికభారము వారిమీద పెట్టిరి. (3) ప్రభువా ఈమె బీదరాలు, ఈమెకు తృప్తికరముగా ఆహారము దయచేయుము అని ప్రార్థించండి. **ప్రార్థన:-** ప్రభువా! నీవు అన్నావు "మీ నమ్మిక చొప్పున మీకు కలుగుగాక" ఆ విధముగానే ఆమె పేదరికము తీసివేయుదువని నమ్ముచున్నాను. "మేము నమ్ముచున్నాము" అని గుడ్డివారు అన్నారు. అలాగే ప్రభువా నేను నమ్ముచున్నాను గనుక "నీవు నా విషయములోను కలుగును గాక" అని చెప్పుము. ఈలాగు వాదము పెట్టుకొన్న తప్పక జరుగును. (ఎ) ప్రభువా ఆ మనుష్యుల (గ్రుడ్డివారు) ఇష్ట ప్రకారము చేసినావుకదా నేనును ఆలాటి మనుష్యుడనే గనుక నా ఇష్టప్రకారము చేయుము. (బి) ఆ గ్రుడ్డివారు 'నమ్ముచున్నాము" అనగానే నీవు 'కలుగుగాక' అన్నావు. ఆలాగే నేను నమ్ముచున్నాను! కలుగుగాక! అని చెప్పుము. (సి) వారి విషయములో నెరవేర్చినావు గనుక- నా ప్రార్థనకూడ నెరవేర్చుము ఆమేన్.

**గమనిక:-** ఈ ప్రకారముగా మీ ఇష్టములోనున్న కోరికలన్నిటిని దేవుని దగ్గర పరచివేయుము. అయితే ప్రార్థించునపుడు

నా కోర్కె ఆయన కోర్కెకాదేమో? నా ఏర్పాటు ఆయన ఏర్పాటు కాదేమో? నా విశ్వాసముబట్టి చెప్పితిని అది దేవుని ఇష్టము కాదేమో? అను తలంపులు హృదయమునకు వచ్చును ప్రార్థించుట, విశ్వసించుట వారి పని. సాతాను ఎంత భయపెట్టినను దేవుని వాగ్దానము గట్టిగా పట్టుకొని నీవు అన్నావు గనుక తప్పక నెరవేర్చుదువు అనుట- అదే విశ్వాసము. "నా నామమునుబట్టి మీరు నన్నేమి అడిగినను నేను చేతును" యోహాను 14:14 అన్నావుగదా. "ఏమి అను మాటలో పలానిది అని లేదు. 'ఏమి' అని వ్రాసి ఉంది. గనుక తప్పక నెరవేరును. వాగ్దానము చేసినవాడు "కాదు" అనుటకు వీలులేదు. "సాతాను చెప్పు మాటలకు అనుమాన పడక, విచారపడక వాగ్దానము గట్టిగా పట్టుకొనవలెను".

ఈ పై విషయములు మీ హృదయములలో ముద్రింపబడును గాక! ఆమేన్.

# 5. ఋషుల దేశము

1. మన హిందూదేశము ఋషుల దేశమని మురియుట మంచిదే. కాని వారు చేయుచున్నట్లు చేయుచు మురియుట మరింతమంచిది. వారు నిత్యము దైవధ్యానములో ఉందురు. అది వారి వృత్తి. మనము దైవధ్యానము చేయగలము. ఒక వృత్తిగా చేయలేము. అయినను ఒక వాడుకగా చేయగలము.

ఏలాగనిన:– ప్రతి కుటుంబములో ప్రతిదినము ఒకగంటయైనను దైవ ధ్యానములో ఉండుటకు వీలుపడును. దినమంతయు మనము చేయు పనులలో ఇదియొక ముఖ్యమైనపని. అందువలన ఆ దినమంతయు దేవుని దీవెన మనకు కలిగియుండును. దైవధ్యానము చేయు సమయములో మనము దేవునికి చెప్పుకొనవలసిన కష్టసుఖములు చెప్పుకొనవచ్చును. కావలసినవి అడుగవచ్చును. తరువాత కొంతసేపు నిశ్శబ్దముగా దేవుని తలంపుతో ఊరకుండ వలయును. అప్పుడు మనకు మంచి ఆలోచనలు తోచును.

2. ఋషులు స్వస్థానమును, స్వజనమును, వృత్తులను మానుకొన్నారు. అవి మనము అట్లు చేయలేము. చేయనక్కరలేదు.

3. మనదేశమును హిందూ దేశమనుటకన్న వేదాంత దేశమనుట యుక్తమని వివేకానందస్వామివారు చెప్పిరి. ఇది మంచి సలహాయే గాని వేదాంతము తెలిసికొని మురియుట మరింత యుక్తమైనపని. మతవిషయములు బాగుగా తెలిసికొనవలయును. ప్రతివారు తమ మతమును గురించియు ఇతర మతములను గురించియు తెలిసికొనుట వలన జ్ఞానాభివృద్ధి కలుగును. తెలిసికొన్న పిమ్మట ఆయాసిద్ధాంతముల

విషయములు జ్ఞానమే తీర్మానము చేసికొనును. సమస్తమును పరీక్షించండి, మేలైనదానిని చేపట్టండి అని బైబిలు చెప్పుచున్నది. ధ్యానము వలనను, మతవిషయములు తెలిసికొనుటవలనను, శుద్ధులకు పాప విసర్జనకు నిర్మలమైన మనస్సాక్షికి కష్టనివారణకు మార్గమేర్పడును. దుర్గుణములు చింతలు అంతరించును. మనశ్శాంతి కలుగును. అప్పుడు మనదేశములోని అన్ని భాగములు ఋషుల భాగములును, వేదాంత భాగములును అగును. దేవుడు మిమ్ములనందరిని దైవధ్యానపరులుగా స్థిరపరచుచుండునుగాక! ఆమేన్.

# 6. సువార్త ప్రచార ప్రార్థన

1. ఓ దేవా! రక్షణ పొందినవారికి సువార్త పనిమీద గొప్ప ఆశకలిగించుము. బావిదగ్గరకు నీళ్ళకు వచ్చిన వనిత (యోహాను 4అధ్యా) రక్షకుని తెలిసికొన్న వెంటనే స్వజనులకు చెప్పవలెనను తలంపు తనంతట తనకే కలిగినది. అట్లే సువార్తికులకు ఒకరి ప్రేరేపణ అవసరము లేకుండానే ఆ తలంపు రక్షణస్థితివల్ల కలిగే నైజము అనుగ్రహించుము.

2. ఓ యేసుప్రభువా! సువార్త ప్రకటనపని నా జన్మహక్కు. నా వారసత్వము. ఎవరు చేసినను చేయకపోయినను నాకక్కరలేదు. నేను తప్పకుండ చేసితీరవలెను అని రక్షితులు అనుకొందురు. ఓ తండ్రీ ఇట్లు అనుకొనుట నాకు దయచేయుము.

3. కుమారుడవైన ఓ తండ్రీ! ఇది నా తండ్రిపని, నేనాయన బిడ్డను, నా తండ్రిపని నేను చేయుట నా విధి. ఇది నా స్వంతపని. కూలీలు కూలికి చేయుదురు. కుమారులు, కుమారులు గనుక చేయుదురు. కుమారులకు బాధ్యత ఉండును. ఇట్టి స్వభావము సువార్తికుడనైన నాకు అనుగ్రహించుము.

4. ఓ రక్షణకర్తా! రక్షింపబడినవారు కృతజ్ఞత గలవారై యుందురు. అట్టి కృతజ్ఞత చూపించుటకు మరియొకరిని రక్షణ మార్గమునకు త్రిప్పవలెనని ప్రయత్నము చేయుదురు. ఊరుకొని ఉండలేరు. తమకు కలిగిన రక్షణానందమునుబట్టి ఆ పని ఆనందముతో చేయుదురు. అట్టి హృదయ స్థితి నాకు దయచేయుము.

5. ఓ తండ్రీ! నీలోనికి వచ్చినవారు తాము రక్షింపబడినవారు కాబట్టి ఎన్ని కష్టములు వచ్చిన లెక్కలేదు. వారు ఇహలోక అంతరంగ బహిరంగ కష్టములను చూచి ఆగరు. తమలోని రక్షణనుచూచి

పాపాత్ములయొద్దకు సాగివెళ్ళి సంభాషింతురు. వారిలోని రక్షణస్థితి శ్రమలస్థితిని అణగద్రొక్కునదైయుండునుగాని, శ్రమలస్థితి రక్షణస్థితిని అణగద్రొక్కునదై యుండదు. ఇట్టి విషయము తెలిసిన సువార్తికుడనైన నేను ఎన్ని శ్రమలున్నా ఎదురు వెళ్ళి ప్రకటించు ధైర్యము దయచేయుము.

6. ఓ నిరీక్షణకర్తా! రైతు పంటకొరకు నిరీక్షించకుండ పొలములో కష్టపడి పనిచేయుడు. ముండ్లు, రాళ్లు చేతిలో గ్రుచ్చుకొన్నపుడు విసుగుకొనడు. అతనికి గాదెలో పోసికొనబోవు ధాన్యమే జ్ఞాపకమునకువచ్చి అంతరంగములో ఆనందించుచుండును. నిజమైన సువార్తికులు వారి కష్టసమయములందు తమబోధవల్ల కొందరి ఆత్మలు రక్షణలోనికి వచ్చును అను సంతోషముతో కష్టములు అనుభవించుదురు. ఓ ప్రభువా! అట్టి నిరీక్షణ మాకును దయచేయుము.

7. ఓ దేవా! సువార్త ప్రకటించుట మా పని. ఆత్మలను రక్షించుట నీ పని. ఎన్నిఏండ్లు ప్రకటించిన ఒక్క మనిషియైన బాప్తిస్మము పొందలేదు, అని విచారించుట మా పనికాదు. మొక్కనాటు వానిలోనైనను, నీరుపోయువానిలోనైనను ఏమియు లేదు. అంకురింపజేసే దేవునియందే సమస్తమునుకలదు అనే నమ్మిక మేము కలిగియుండవలెను. ఓ ప్రభువా! ఫలితము కనబడకపోయినను నిరాశపడక మా ఉద్యోగధర్మము సాగించుకొనే చురుకుదనము అనుగ్రహించుము.

8. ఓ యేసుప్రభువా! భూదిగంతములవరకు వెళ్ళి మీరు నాకు సాక్షులై ఉండండి అని మాకు సెలవిచ్చినావు కదా! (కార్య 1:8) నీవు ఎటువంటివాడవో, నీ పని ఎటువంటిదో, నీ పని ఫలితము ఎటువంటిదో ఇతరులకు మేము చెప్పునప్పుడు నేర్చుకొన్న మాటలుకాక అనుభవించినవి చెప్పుటవల్ల మేము సాక్షులమై యుండగలము. అట్టి సాక్షులమైయుండుటకు, అనుభవసాక్షులనుగా

మమ్మును సిద్ధపరచుము. షరా:- యేసుప్రభువు పాపులను క్షమించినాడు, రోగులను బాగుచేసినాడు మంచిబోధ చేసి మనుష్యులను మార్చినాడు అని చెప్పుట సువార్త ప్రకటనయైయున్నది. ప్రభువు నన్ను క్షమించినాడు నన్ను బాగుచేసినాడు, నాకు వాక్యము చెప్పుచున్నాడు అని చెప్పుట స్వంత సాక్ష్యమైయున్నది. ఓ ప్రభువా! మేము సువార్త ప్రకటించువారమైయుండుట మాత్రమేగాక, సాక్షులముగాకూడ ఉండే కృప దయచేయుము.

9. ఓ తండ్రీ! నీవాక్య వేదాంతమునకు అంతములేదు. మరి ఎంతతరచిన తరగదు. నాకు పూర్తిగా తెలియదుగాని, తెలిసినంతమట్టుకు చెప్పుదును. ఎవరికిని పూర్తిగా తెలియదు. పరలోకములో పూర్తిగా తెలుస్తుంది. అంతయు ముందే తెలిసికొనవలెననునది నేను విడిచిపెట్టవలెను. సువార్త పని అనునది ప్రకటించుట, సాక్షమిచ్చుటయైయున్నది. ఈ రెండు ఉద్యోగములు మనము చేయవలసిన ఉద్యోగములు. షరా: నేను నా ఇంటిలోనే ఉండి సువార్త పనికి వెళ్ళకుండా భక్తిగానున్న చాలదా? అని కొంతమంది క్రైస్తవులు అనుచున్నారు. ఓ తండ్రీ! ఇట్టి అభిప్రాయము నాలోనికి చేరనీయకుము. ఇంటిలో భక్తిగా నుండవలెను (మత్త. 5:16) సువార్తకూడ చేయవలెను. రెండు ఉండవలెను. బోధకుడవుగా నుండకపోయినయెడల "మీరు వెళ్ళి సమస్త రాష్ట్రములకు బోధించండి" అని ప్రభువు చెప్పినమాట ఎట్లు నెరవేరును మార్కు 16:15. గనుక ఓ ప్రభువా! ఈ రెండు స్వభావములు నాకు దయచేయుము. నేను బైబిలంతా బాగానేర్చుకొని ఆ తరువాత బోధకు బైలుదేరుదును అని కొందరు క్రైస్తవులు అనుచున్నారు. బాగుగా నేర్చుకొనుటమంచిపనే గాని, నేర్చుకొన్నంతమట్టుకు ఇతరులకు చెప్పవలెను. నేర్చుకొనుటకు అంతములేదు. అప్పటివరకు వెళ్ళను

అనుట సువార్తపని ఎగరగొట్టుటయైయున్నది. ఒకదరినుండి నేర్చుకొంటూ మరియొక దరినుండి బోధిస్తూయుండుట సాధ్యమే. ప్రభువుయొక్క శిష్యులు నేర్పు పూర్తికాకముందుకూడ సువార్తకు వెళ్ళినారు. డెబ్బదిమంది చరిత్రచూడండి. (లూకా 10:1-12) ఓ ప్రభువా! పూర్తిగా అభ్యాసము కాకముందును నీ శిష్యులకు సువార్త పనిమీద పంపినట్లు మమ్మునుకూడ పంపుము. నీకు స్తోత్రము.

10. ఓ ప్రభువా! ఒకదరికి బోధించునపుడు మనస్సులో మాకు మేము బోధించుకొనే బుద్ధి అనుగ్రహించుము. వారికిచ్చే వర్తమానము మాకును అన్వయించుకొనుశక్తి దయచేయుము.

11. ఓ దేవా! మా ప్రార్థనవల్లను, మా బోధవల్లను, మా ప్రవర్తన వల్లను సువార్త ప్రకటించు సామర్థ్యము కలుగజేయుము. నీకు స్తోత్రములు. (1కొరింథి 9:16,17,18; రోమా 1:15,16) అయ్యో నేను సువార్త ప్రకటింపకపోయిన యెడల నాకు శ్రమ. ఓ ప్రభువా! నీ సువార్త ప్రకటింపని నాకు మనస్సులో శ్రమగా తలంచుకొనే పౌలు తలంపు నాకుకూడ కలిగించుము.

12. ఓ క్రీస్తుప్రభువా! సువార్తను ఉచితముగా ప్రకటించుటయే నాకున్న జీతము. (రోమా 9:18) ప్రభువా సువార్తను ఉచితముగా ప్రకటించుటయే నా జీతమని పౌలు సంతోషించునట్లు నేనుకూడా సంతోషించగల ఆత్మను దయచేయుము.

13. ప్రభువా! జీతమునకుగాని, ఇతరులు ఇచ్చే సహాయమునకుగాని ఆశించి సువార్తపనికి వెళ్ళక నీవే నా పోషకుడవు అనే తలంపుతో సువార్త ప్రకటించుటకు వెళ్లే మనస్సు దయచేయుము. (మత్త. 10:19,20) సభలోనికి పిలిచినప్పుడు నామకార్థముగాగాని, వేషధారణగాగాని నిరీక్షణలేకుండగాని, శ్రద్ధ లేకుండగాని ప్రార్థన మొదలగు పనులు చేయకూడదు. సువార్త ప్రకటించువారికి ప్రకటించే

అధికార పత్రముగలదా! ఆ పత్రములోనున్న సరిహద్దులు ఏవనగా భూదిగంతముల వరకు వెళ్ళండి. సర్వరాష్ట్రములకు చెప్పండి. సర్వప్రదేశములలో చెప్పండి (మత్త. 28:19). జనములందరికిని చెప్పండి. సమయమందును, అ సమయమందును చెప్పండి. 2తిమోతి 4:2. సువార్త ప్రకటనకుగల మూడు అధికారములు ఏవనగా (1) వినయాధికారము- అనగా వినయముతో ప్రకటించుట. (2) స్వతంత్రాధికారము- అనగా ప్రకటించుటకు నాకు హక్కు ఉన్నదనియు, సువార్త నాకు అప్పగింపబడిన సందేశమనియు తలంచుకొని ప్రకటించుట. (3) జ్ఞానాధికారము- అనగా ఏమి చెప్పవలయునో నాకు తెలుసును అని నిశ్చయత కలిగి బోధించుట. ఓ ప్రభువా! మా వినయాధికారముతో, మా స్వతంత్రాధికారముతో, మా జ్ఞానాధికారముతో సువార్త బోధించే కృపదయచేయుము. నీకు స్తోత్రములు.

14. ఓ ప్రభువా! నీవు పరలోకమునకు వెళ్ళిన తర్వాతకూడ భూమిమీద సువార్త ప్రచారము చేస్తున్న శిష్యులకు జతగా నున్నావని వ్రాయబడియున్నది మార్కు 16:20. నీకు స్తోత్రములు. “ప్రభువు వారికి సహకారుడైయుండి, జరుగుచువచ్చిన సూచకక్రియల వలన వాక్యమును స్థిరపరచుచుండెను.” ఆ రీతిగానే నీవు మాకుకూడ సహకారివిగా నుండుమని వేడుకొనుచున్నాము. మరియు ఓ ప్రభువా! వారు బోధించుచున్న బోధను అద్భుతములవలన స్థిరపరచినావని వ్రాయించినావు స్తోత్రములు. మా బోధనుకూడ స్థిరపర్చుమని వేడుకొనుచున్నాము.

15. ఓ ప్రభువా! బోధించునప్పుడు ఏమి చెప్పవలెనో చింతింపవద్దనియు, సమయానుకూలముగా ఉపదేశము ఆత్మ అందించుననియు సెలవిచ్చినావు. కాబట్టి ఈ మాట జ్ఞాపకముంచుకొని

నిర్భయముగ సువార్తపని ఆరంభించే కృప దయచేయుము. మరియు వాక్ ధోరణికూడ అనుగ్రహించుము. నీకు స్తోత్రములు.

16. ప్రభువా! నీయాత్మతో సువార్తికులను నింపి పనిజరిగించుము. మాకు తెలియదనియు, మేము చెప్పలేమనియు తలంచక మా ప్రభువునకు అన్నియు తెలియును. ఆయనే అందించును అని అనుకొని సువార్త ప్రకటించునట్లు కృపదయచేయుము. వందనములు.

17. "సువార్తనుగూర్చి నేను సిగ్గుపడువాడనుకాను" (రోమా 1:16, 2తిమో. 2:15) అని వ్రాయబడియున్న ప్రకారము ఓ ప్రభువా! స్వజనులయొద్దగాని మేమెరిగినవారి యొద్దగాని, స్నేహితుల యొద్దగాని, మాస్వకీయ చరిత్ర తెలిసినవారియొద్దగాని, సువార్త చెప్పుటకు సిగ్గుపడుట సహజమై యున్నది. ఇట్టి బలహీనత మాకు లేకుండచేయుము.

18. ఓ ప్రభువా! అన్ని సమయములలో సువార్త చెప్పే ఇష్టము, వాక్కు, వీలు, జయము అనుగ్రహించుము. ఎందుకనగా సమయమందును అసమయమందును సువార్త ప్రకటింపుము (2తిమో. 4:2) అని వ్రాయబడియున్నది. అసమయమందును అనగా వీలులేనప్పుడును అని సువార్త ప్రకటననుగూర్చి పౌలు వ్రాయుచున్నాడు. మనము మిక్కిలి అవసరమైన పనిమీద ఉన్నప్పుడు సహితము బిక్షకులువచ్చి గోజులాడుదురు. మన సమయము, మన వీలు, మన ఇబ్బంది వారెరుగరు. వారు గమనించరు. లెక్కచేయరు. సువార్తికులయితే వారేదో మాట్లాడుకొనుచున్నారు. తర్వాత సువార్త చెప్పవచ్చునని ఆ సమయమును దాటబెట్టుదురు. పౌలు అన్ని అవసరములకంటె సువార్తయే మిక్కిలి గొప్పఅవసరమని చెప్పెను. ఆ తరువాత ఆ మనిషి దొరకకపోవచ్చును. సువార్తపని నాకిష్టము లేకపోయినను, పౌలు

వ్రాసినదే మాకందరకు సంబంధించినదని గ్రహించి లోబడగల కృప దయచేయుము. ఓ దేవా! సువార్తపని అనునది ఎదుట ఉన్న మనుష్యుని రక్షింపవలసిన పని గనుక. నాకు రక్షణ అందుట అవసరమని తోచిన ప్రకారముగా ఇతరులకుకూడా రక్షణ అందించుట అంతే అవసరమని నాకు కనపర్చుము. నీకు స్తోత్రములు.

19. ఓ ప్రభువా! సువార్తపని రక్షితునియొక్క జన్మవృత్తి లోకములోని అన్ని వృత్తులకంటెను, ఉద్యోగములకంటెను, పనిపాటులకంటెను గొప్పదై యున్నది. దేవా, ఇంతగొప్ప ఉద్యోగముచేయుట నేనెట్లు మానగలను అను తలంపు నాకు సువార్త ఉద్యోగ విషయములో కలిగించుము స్తోత్రములు.

20. ఓ ప్రభువా! గడచిన సంఘ శతాబ్దములలో సువార్తికులు పట్టణములలో, పల్లెలలో, అరణ్యములలో, నీటిమీద, కొండలమీద, కందకములలో, సొరంగములలో సువార్త ప్రకటించిరి. విద్వాంసులకు, పామరులకు, అధికారులకు, రాజులకు, అరణ్యవాసులకు, నరమాంస భక్షకులకు సువార్త ప్రకటించెను. అవమానములకుగాని, ఇబ్బందులకుగాని, మరణమునకుగాని భయపడకుండ సువార్త ప్రకటించిరి (హెబ్రీ. 11:33-40). అలాగే నేటికాల సువార్తికులు ప్రచారముమీద వెళ్ళుచున్నారు. వారు సువార్త ప్రకటించుటలో ఏ మాత్రమును సందేహింపక సంతోషముతో ప్రకటించు కృప దయచేయుము. అన్న వస్త్రాదులకుగాని, బసకుగాని, సువార్తపనికిగాని, ఎట్టి చిక్కులు రానీయకుము. ఒకవేళ వచ్చినయెడల సంతోషమువల్ల జయించు కృప అనుగ్రహించుము. స్తోత్రములు.

21. ఓ దేవా! కఠిన హృదయులకు, మాట చొరబడనియ్యని వారికి, అక్కరలేదనువారికి, విని తప్పులు పట్టువారికి, తప్పు అర్థము చేయువారికి, నాకు తెలుసును అనువారికి, సమయములేదని

చెప్పువారికి వాక్యము బోధించే ఉపాయము అనుగ్రహించుము. స్తోత్రములు.

22. ఓ దేవా! నీకృపవలన ప్రతి శతాబ్దములో నీవిశ్వాసులకు నూతన విషయములు బయలుపరచుచున్నందులకు నీకనేక స్తోత్రములు. మాకుకూడ కొన్ని క్రొత్త విషయములు బయలుపరచినావు గనుక స్తోత్రములు. మాకు బయలుపడిన విషయములు నీవాక్యము చదువువారే అంగీకరింపరని మాకు తెలిసినప్పటికిని వారికి అన్ని వివరముగా బోధించు శాంతగుణము, జ్ఞానము అనుగ్రహించుము.

23. ప్రభువా! ఇతరులు ఎదిరింపనివాక్కును జ్ఞానమును దయచేయుము (కార్య 6:10; లూకా 21:15) 1. బోధ 2. అనుభవము 3. సిద్ధాంతము 4. దర్శనము- ప్రభువు ఏమిచెప్పునో అదిచేయుట. ఇవి మనము ఒప్పుకొనుచున్నాము. కొందరు ఇవి ఒప్పుకొనమంటున్నారు. గనుక ప్రభువునకు రిపోర్టు చేయవలెను. 1. ప్రభువునకు మన స్వంత విషయములు రిపోర్టు చేయవలెను. 2. ఇతరులను గూర్చి చేయవలెను. 3. కావలసినవి అడుగవలెను. 4. ఇతరులనుగూర్చి విజ్ఞాపన చేయవలెను. 5. ప్రశ్నలు వేయవలెను.

24. ఓ దేవా! "అనుదినము ఆయన రక్షణ సువార్తను ప్రకటించుడి" (కీర్తన 96:2; 1దిన. 16:23) అని వ్రాయబడియున్నది. సువార్త అనునది అనుదినము ప్రకటింపవలసినది అని ఈ రెండు వాక్యములలోను కనబడుచున్నది. అనుదినము అనుమాట ముఖ్యమైనమాట. ఓ ప్రభువా, సువార్తను అనుదినము ప్రకటింపగల కోరిక నాలో పుట్టించి, అందుకు అనుకూలమైన సమయమును అనుగ్రహింపుము. స్తోత్రములు.

25. మధుర జిల్లాలోని రామనాడు అను గ్రామ సంఘములో 12మంది క్రైస్తవులు ఇట్లు మాట్లాడుకొనిరి (లూకా 10:4-12) మీరు

సంచినైనను, జాలెనైనను, చెప్పులనైనను తీసికొని పోవద్దు అని ప్రభువు తన శిష్యులతో చెప్పినారుగదా. అది మనకాలములో నెరవేరునో, నెరవేరదో పరీక్షించుటకు మనమేదియు తీసికొని వెళ్ళకుండ సువార్త ప్రకటించుదము అని అనుకొనిరి- ఓ ప్రభువా! నీవు బీదవాడవా! గిల్లిపుచ్చుకొని ఇస్తావా? లక్షలు ఇస్తున్నావు. ఇంకను ఇమ్ము! చనువునుబట్టి అడుగుచున్నాము. ఆమేన్ అని ప్రార్థించుకొని ఈ ప్రకారముగా వారు మాట్లాడుకొని ఒక నెల దినములు సువార్తచేసి తిరిగివచ్చిరి. వారు తమ సంఘమునకు రిపోర్టు చేసిరి. మాకు భోజనమునకు లోటులేదు, పడిశమైననుపట్టలేదు, ఎట్టి ఇబ్బందియైనను కలుగలేదు. తిండినిగూర్చి గాని, బసనుగూర్చిగాని ఆలోచింపక తిన్నగా వీధులలోనికివెళ్ళి ప్రసంగించినాము. వారు మాలో ప్రతివారిని తమ ఇండ్లకు తీసికొని వెళ్ళి సమస్త సదుపాయములు చేసిరి. ప్రభువు వాక్యము నెరవేరెను అని చెప్పెను. స్తోత్రములు. ఓ ప్రభువా! నీ సువార్త పనిమీద వెళ్ళునప్పుడు ఏమి తిందుమో, ఏమి త్రాగుదుమో, ఏమి ధరించుకొందుమో, ఎక్కడ బసచేయుదుమో అని చింతింపక అన్నియు నీవే చూచుకొందువను సంతోషముతో వెళ్ళు విశ్వాసము దయచేయుము. మరియు వ్యాధులు, శత్రుబాధలు, ఆటంకములు, వినకపోవుటలు కలుగునేమో అని భయపడక నీవే మా సహాయకారివి అనిచెప్పి ధైర్యముతో ప్రయాణము సాగించు కృపను దయచేయుము స్తోత్రములు. ఈ మా ప్రార్థన మనవులన్నిటినీ నీ కుమారుని పరిముఖముచూచి ఆలకించుము ఆమేన్.

# 7. యెరికో నీరు బాగుపడుట

వాక్యము: 2రాజులు 2:19-22.

దైవజనుడైన ఎలీషా రెండంతల ఆత్మనుపొంది ఏలీయాకన్న ఎక్కువ అద్భుతములు చేసెను. యెరికో శపించబడినది, అక్కడి ప్రజలు అవిధేయులు, అందువలన భూమి శాపముపొందెను. గనుక ఆ నీరు మంచిదికాదు, భూమిసారము మంచిదికాదు. గనుక పంటలు సరిగా పండవు. ఇవి అవిధేయులైనవారు అనుభవింపవలసిన శిక్షలు. ఇవి దుష్టఫలితము. అట్టి ప్రజలకుకూడ దేవుడు కృపను చూపించెను. ప్రవక్తల పాఠశాలలు అక్కడగలవు. అందు యౌవనస్తులకు తర్ఫీదు నిచ్చిరి. వారే తరువాత ప్రవక్తలుగా తయారైరి. ఈ పట్టణమునందలి అవిధేయులకు కూడ దేవుని వాక్యము విను కృపాసమయమును దేవుడనుగ్రహించెను. దేవుని వాక్యము వినువారిని ప్రోగుచేసి వారికి వాక్యముచెప్పి ప్రవక్తలుగా సిద్ధపరచి అట్టి శిష్యులలో కొందరువచ్చి ఎలీషాతో ఈ పట్టణములో నీరు మంచిదికాదు, భూమిసారము మంచిదికాదు అని చెప్పిరి. వీరికి ప్రవక్తయెడల గౌరవము కలదుగాని మిగతావారికిలేదు. అట్టి అవిధేయులకు ఇంకా కృపను చూపించుచుండెను. ఆ స్థలము రమ్యమైన స్థలము, ఎక్కడ భూసారము లేదో, మంచినీరుకాదో అది రమ్యమైన స్థలము. అనగా ఆ స్థలముపైకి రమ్యమైనది. ఆ రీతిగానే మానవుల చరిత్ర చూచిన విద్య, ఉద్యోగము, ధనము, సౌఖ్యము అంతయు పైకి రమ్యముగానేయుండును. గాని వారి ఆత్మీయ జీవనము చూచిన ఏమియు బాగుగా నుండదు. యెరికో పట్టణమునందు భూమి పైకి రమ్యముగా నున్నదిగాని నీరు మంచిదికాదు, సారములేదు గనుక అన్నపానములు, ఆహారము లేదు. క్రైస్తవులుకూడ అట్లేయున్నారు. పైకి బాగున్నారుగాని వారి

అంతరంగమున మంచిలేదు, సారములేదు గనుక అన్నపానములు, ఆహారములేదు. క్రైస్తవులుకూడ అట్లేయున్నారు. పైకి బాగున్నాగాని వారి అంతరంగమున మంచిలేదు, సారములేదు, ఫలితముకూడా లేదు. మన జీవితము సరిచేసికొనుటకు ఇది అద్దమువలె నున్నది. మంచివారమైనను చెడ్డవారమైనను దేవుడు తన మంచితనమునుబట్టి సమస్తమును అనుగ్రహించును. పైకి కనబడు వేషధారణ ఉన్నను దేవుడు కృప చూపించక మానడు. మనలను మంచివారిని చేయుటకు దేవుడు అట్టి కృపను చూపించును.

ఎలీషా వారితో (1) క్రొత్త పాత్రకావలెను. (2) ఉప్పు కావలెను. ఉప్పుపాత్రలోవేసి తీసికొనిరమ్మని చెప్పెను. శిష్యులు ప్రవక్త ఏమి చెప్పిన అది చేయవలెనని నేర్చుకొనిరి. ఎందుకు ఉప్పు? ఎందుకు పాత్ర? అని ప్రశ్నించలేదు. వారు ప్రవక్త చెప్పినట్లు చేసిరి గనుక వారుకూడ గొప్ప ప్రవక్తలైరి. క్రొత్తనిబంధనలో కానా వివాహములోకూడ నీరు మోయువారు ప్రభువు చెప్పినట్లు చేసిరిగాని నీరు ఎందుకు అని అడుగలేదు. ఆలాగే విశ్వాసి ప్రభువు చెప్పినది చేయుట నేర్చుకొనవలెను. ఆ పట్టణములోనివారు అవిధేయులుగాని ఈ పాఠశాలలోని బాలురు విధేయులుగా నుండిరి. మనమును విధేయులము కావలెనని తండ్రి కోరుచున్నాడు. అప్పుడు ప్రవక్త ఆ నీరు బాగుచేయుటకు పాత్రలోని ఉప్పును నీటిఊటలో వేయుమని చెప్పెను. నీరు ప్రవహించు ప్రవాహములో వేయలేదు. నీరు ఎచ్చటినుండి వచ్చుచున్నాదో ఆ ఊటయొద్ద వేసెను. ఎందుకు నీటి ఊటలోవేసెను. పైపైన దేవుడు మనలను బాగుచేసిన ఏమిలాభము. అంతరంగము బాగుచేయవలెను. పాపము ఎక్కడ పుట్టుచున్నదో అదే ప్రభువు ముట్టి బాగుచేయవలెను. ఊటలో ఉప్పువేసిన అక్కడినుండి వచ్చు నీరు శుభ్రమగును. ఆలాగే అంతరంగము శుద్ధి

అయినయెడల బహిరంగము బాగుగా నుండును. బహిరంగముగా చేయు చెడ్డపనులు మానిన మంచిదేగాని అంతరంగము శుద్ధి అయిన పైన క్రియలు బాగుపడును. భూమిలో ఫలసారము బాగున్నయెడల పైపంట బాగుపడును గనుక మనము వాక్యమునకు లోబడి అంతరంగమును శుద్ధిచేసికొనవలెను. ఉప్పు దేనికి సూచన? ఉప్పు సారము గలిగినది, మరియు రుచిని కలిగించునది. కొంచెము ఉప్పువేసిన అంతకాలమునుండి వచ్చు నీరు బాగుపడునా? దేవుడు ఆ నీటిని బాగుచేసినాడని గ్రహించుటకు ఉప్పు గురుతుగా నున్నది.

దేవుడు మానవులను దేనివలన బాగుచేయును? ఆయన ఉచితమైన కృపవలన గనుక ఉప్పు దేవుని ఉచితమైన కృపకు గుర్తుగా వాడబడెను. శిష్యులకు విధేయత, విశ్వాసము ఉన్నది గనుక వీటిని బలపరచుటకు సూచన పెట్టెను. బహిరంగ గురుతులనుబట్టి వారు గ్రహించుకొందురు. దేవునికృప పాపిలో ప్రవేశించిన మనిషిమారును. దేవుని కృపను ఎవరు అంగీకరించగలరు? పాపులు, పాపమును ప్రేమించువారు మాత్రము అంగీకరింపలేరు. పాపమును విసర్జించువారు ప్రభువునొద్దకు రాగలరు, వచ్చి కృపను అంగీకరింపగలరు. అంతేగాక వారి హృదయమును నూతనముగాచేసికొని దేవునియొద్దకు రాగలరు, క్రొత్త పాత్రవలెనున్న క్రొత్తహృదయములో దేవునికృప ప్రవేసించును. పాత్ర క్రొత్తదై యుండవలెను. మనము మంటి పాత్రులమైయున్నాము. గాని ఇట్టి మనలోనే దైవమహిమ బయలుపర్చబడినది. దేవుని మహిమ, పాత్రలో ఉప్పువేయుటద్వారా బయలుపడినది. మనమును వాక్యమువిని దేవునికృప పొందినయెడల నిజముగా దేవుని మహిమపరుపగలము. ప్రవక్తచెప్పిన మాటలేవనగా "యెహోవా సెలవిచ్చునదేమనగా" అని పలికెను. దేవుడు సెలవిచ్చినాడు గనుక నెరవేరును. శిష్యులు చెప్పినట్లు

చేసినారు, దేవుడు అద్భుత కార్యములు జరిగించెను. మనిషి చేయువలసినపని మనిషిచేసిన దేవుడు చేయువలసినపని ఆయునచేయును. శిష్యులు మరియు గురువు చేసినపని సుళువైనపనిగాని దేవుడు గొప్పపని చేసెను. వాక్యములో చెప్పబడినట్లు చేసిన గొప్పకార్యము దేవుడు చేయును– మన ఆత్మీయ జీవనమునకు కావలసిన అవసరములు రెండు, అవి జీవనాధారములు. ఆహారము, జీవజలము. మనకు వాక్యాహారము గలదు. దేవుని వాక్యము మనభాషలోనికి అందించినాడు, అది చదివి, అర్ధము చేసికొని అనుభవించుచున్నాము. దేవుడు మనజ్ఞానమును వెలిగించిన యెడల చదివినది అర్ధమగును. అప్పుడు అనుభవము కలుగును. అనేకులు అట్టివాక్యము చదువరు గనుక నీరసముగా నుందురు. శిష్యులు వారికి తెలిసినా తెలియకపోయిన చెప్పినట్లు చేసిరి గనుక మహోపకారము చూచియున్నారు. ఆ పట్టణములోని నీటివలన ''మరణము, నిస్సారము'' వచ్చినదని గలదు. అట్టిస్థితిని బాగుచేసితినని యెహోవా సెలవిచ్చుచున్నాడు. దేవుని దృష్టిలో బాగైనది. దేవుని దృష్టిలోనున్నది ప్రవక్తచెప్పెను. అదివారు నమ్మినారు గనుక ఉపకారము పొందిరి. దేవునివాక్యము నమ్మవలెను, అప్పుడు నెరవేరును. దేవుడు బాగుచేసిన యెడల అది శాశ్వతముగా నుండును. దేవునివాక్యము శాశ్వతము. (ప్రసంగి 3:14) దేవుని ఉపయోగము శాశ్వతము దేవుడు చేయు పనులన్నియు శాశ్వతములు. వారు దేవునికి విధేయులైనప్పుడు అన్ని ఉపకారములు పొందిరి. వారి విశ్వాసము విధేయతనుబట్టి నీరు మంచిదైనది, భూమి సారవంతమైనదైనది. మనమును అట్టి విశ్వాస సంబంధమైన నీరు త్రాగి సంతుష్టి పొందుదుము. ఆహారము తిని బలపడుదుము. ఆత్మీయబలము, సంతుష్టి పొందుదుముగాక! ఆమేన్.

# 8. విశ్వాసులకు సహాయము

*క్రైస్తవ విశ్వాసులారా! మీకు అన్నిటిలోను దైవసహాయము కలుగునుగాక!*

1. క్రైస్తవ విశ్వాసులారా! భూలోకములోని విశ్వాసులు మీ కష్టములను ఎరిగినవారై మీ కష్ట నివారణార్థమై దైవప్రార్థనలు చేయుచుందురు గనుక మీరు మీ కష్టములవలన నలిగిపోవద్దు. విశ్వాసుల ప్రార్థనలన్నియు దేవుని సింహాసనము నొద్దకు చేరును. వారి ప్రార్థనలు దేవుని వాగ్ధానముమీద ఆధారపడియుండును. ఇబ్బందులు, వ్యాధులు, అవమానములు, పురుగు బాధలు, శత్రుబాధలు, సైతాను పుట్టించునట్టి అవిశ్వాసపు తలంపులు- కష్టములనగా ఇట్టివే.

2. మోక్షలోక వాస్తవ్యులు మిమ్మును గురించి దేవుని నిత్యము ప్రార్థించుచుందురు. వారు భూలోకమునుండి వెళ్ళినవారే. వారిలో కొందరు మన స్వకీయులు, మిత్రులు, మనలను ఎరిగినవారు గనుక మన కష్టములు వారికి తెలిసియేయున్నవి. వారు మనలను విడిచి వెళ్ళినంతమాత్రమున మనలను మరచిపోయినారని తలంపరాదు. వారి ప్రార్థనలుకూడ దేవుని వాగ్దాన కృపమీద ఆధారపడియున్నవి గనుక మనము విచారముతో కాలము గడుపరాదు.

3. దేవుని సింహాసనమునొద్దనున్న దేవదూతలుకూడ మన నిమిత్తమై ప్రార్థించుచున్నారు. హెబ్రీ. 1:14లో వారు మనకు పరిచర్య చేయువారైయున్నారని వ్రాయబడియున్నదిగదా! మనకు ఆపద రాకుండ మనయొద్ద కావలిగాయుండునట్టి మిత్రులు వారు. పరిచర్యలలో ఒక పరిచర్య ప్రార్థన పరిచర్యయే. వారు అన్ని విధముల సహాయము చేయుచు ప్రార్థన విషయములో సహాయము చేయనియెడల నిష్ప్రయోజనముగదా!

4.ప్రకటన నాల్గవ అధ్యాయములో ఏమి ఉన్నది? దేవుని సింహాసనము చుట్టు ఉన్న వ్యక్తులు: (1) సింహము (2) దూడ (3) మనుష్యుడు (4) పక్షి. అర్థము:- 1. దేవదూతలు సింహముకొరకు అనగా అడవి మృగములకొరకు ప్రార్థించుచున్నారు. 2. దేవదూతలు దూడకొరకు అనగా ఊరిలోనున్న పశ్వాదులకొరకు ప్రార్థించుచున్నారు. 3. దేవదూతలు లోకములోని మనుష్యుని కొరకు అనగా మనుష్యులందరికొరకు ప్రార్థించుచున్నారు. 4. దేవదూతలు పక్షికొరకు అనగా లోకములోని అన్ని విధములైన పక్షులకొరకు ప్రార్థించుచున్నారు. ఈ ప్రకారముగా దైవసృష్టియంతటిని గురించి నిత్యము దేవదూతలు ప్రార్థించునట్టి ఏర్పాటుకలదు గనుక సృష్టి ఎంత ధన్యత కలది! అందులో మనము ఎంత ధన్యులము! ఈ ఏర్పాటును నమ్మువారే విశ్వాసులు. వారికి ఏర్పాటువలన సహాయము అందును. అవిశ్వాసులకుకూడ అందును. కాని అది ఈలోకము మట్టునకే సరిపోవును. మోక్షలోకమునకు సరిపోదు గనుక విశ్వాసులారా నిత్యానందము కలిగియుండండి. విచారమునకు చోటియ్యకండి. ధైర్యముతో నిబ్బరముగా నడవండి. నాకేమియు పర్వాలేదు అని అనుకొనుచుండండి.

5. ప్రకటన 5వ అ॥లో ఏమి ఉన్నది. సృష్టియావత్తు దేవుని స్తుతించుచున్నట్లున్నది. ఎందుచేతననగా అది దేవుని ఉపకారమును గ్రహించినది. ఇది ఎంత సంతోషకరమైన సంగతియైయున్నది.

6. లోకములోని విశ్వాసులు, మోక్షలోకములోని పరిశుద్ధులు పాపమెరుగని దేవదూతలు మనకొరకు ప్రార్థించుచున్నారను సంగతి

మనము జ్ఞాపకముంచుకొన్న యెడల మనము మరింత ఎక్కువ ప్రార్థన చేయుటకు ప్రేరేపణ కలుగకమానదు.

7. బైబిలు కథ వినండి. శత్రుసైన్యము ఎలీషా ఉన్న పట్టణమును ముట్టడివేసినప్పుడు ఆయన సేవకుడు పెందలకడలేచి ఆయనతో ఇట్లనెను "అయ్యా! నా యేలినవాడా మనము ఏమిచేయుదమని ఆ దైవజనునితో అనగా అతడు భయపడవద్దు మనపక్షమున నున్నవారు వారికంటె అధికమైయున్నారనిచెప్పి - యెహోవా! వీడు చూచునట్లు దయచేసి వీనికండ్లను తెరువుమని ఎలీషా ప్రార్థనచేయగా యెహోవా ఆ పనివారి కండ్లను తెరవజేసెను గనుక వాడు ఎలీషాచుట్టును, పర్వతము అగ్నిగుర్రములచేతను, రథములచేతను నిండియుండుట చూచెను." కాబట్టి విశ్వాసులారా మనకు సహాయము చేయువారి సంఖ్యయే ఎక్కువని తలంచుకొని దేవుని స్తుతించుచు నిర్భయముగా నుండండి. (2రాజులు 6అ॥ము) శత్రువులు అప్పటినుండి వచ్చుట మానివేసిరి.

8. (1) ఆది 32:26 "నీవు ఆశీర్వదించితేనేగాని నేను విడువను" అని యాకోబు ప్రార్థించెను. అది నెరవేరెను. (2) తన మనవి న్యాయాధిపతి ఆలకించువరకు ఒక స్త్రీ న్యాయసభకు వెళ్లుట మానలేదు. న్యాయకర్త విసుగుకొని ఆమె మనవి ప్రకారము న్యాయము తీర్చెను లూకా 18:1-8. (3) ఒక స్నేహితుడు తన స్నేహితునియొద్దకు అనుకూలము కాని సమయమందు వెళ్ళి రొట్టెలు అడిగెను. ఆ స్నేహితుడు వీలులేదని చాలమార్లు చెప్పెను. అయినను వెళ్ళినవ్యక్తి గుమ్మముదగ్గర నిలువబడి మాటిమాటికి అడుగుచుండెను. తుదకు

తన కోరిక నెరవేరెను లూకా 11:5-8. (4) ఏలీయా మనవంటి స్వభావముగలవాడైనను పట్టుదలతో ప్రార్థింపగా వర్షము కురిసెను యాకోబు 5:17- ఈ నాలుగు కథలలో ఉన్న సంగతిని అనుసరించి ప్రతి కుటుంబము ప్రార్థింపనియెడల క్రైస్తవమతము అక్కరలేని వారివలన కలుగు ఒత్తుడు తప్పదు. అది వచ్చునప్పుడు మనము సహింపలేము. వారిని క్షమించి దీవించుమని దేవుని ప్రార్థించండి.

9. మీరు శోధనలో ప్రవేసించకుండునట్లు మెళుకువగా ఉండి ప్రార్థన చేయండి. (మత్తయి 26:41) అని ప్రభువు తన శిష్యులకు చెప్పెనుగదా! మనము అట్లుచేసిన యెడల ప్రార్థనఫలము దొరుకును.

10. 'నా నామమునుబట్టి మీరు నన్నేమి అడిగినను నేను చేతును' (యోహాను 14:14) అని ప్రభువుచెప్పినమాటలో **ఏమి** అనుమాట గుర్తించండి.

హెబ్రీ 12:1 ఇంతకంటె గొప్ప విశ్వాస సహాయ సాక్ష సమూహము మేఘమువలె మనలను ఆవరించి ఉన్నందున మనము కూడా ప్రతి భారమును, సుళువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించు వాడునైన యేసువైపుచూచుచు, మనయెదుట ఉంచబడిన పందెములో పరుగెత్తుదుముగాక! ఆమేన్.

# 9. దేవుని ప్రార్థించుడి

దేశీయులారా! అపాయము వచ్చినప్పుడు తప్పించుకొనుటకు మీరెన్నో ప్రయత్నములు చేయుదురు. అవన్నియు నెరవేరుటకును, నూతన సాధనములు కల్పించుటకును, దైవప్రార్థన ప్రయత్నము చేయగలరా? ఇది అన్ని యత్నములకంటె మొదటిది; ముఖ్యమైనదియునై యున్నది. గాలి, వానలు, వరదలు, ఆకలి, భేదములు, చలి, వేడి, సముద్ర ప్రయాణములు, బండ్ల ప్రయాణములు, జంతువులు, పురుగులు, పిడుగు, భూకంపము, వ్యాధులు, ఇబ్బందులు, కరవులు ఈ మొదలగు వానివలన హాని కలుగుచున్నది. ఇవి దేవుడు గాక మరియెవరు తప్పింపగలరు? గనుక భూమ్యాకాశములను, సమస్తమును కలుగజేసిన ఆయననే ప్రార్థించుడి. ఆయన కలుగజేసిన సృష్టిలోని దేనిని ప్రార్థించినను ప్రయోజనములేదు. ఏది మిగుల అపాయకరమైన కాలము? పైన ఉదహరించినట్లుగా పాపశాపమువలన భూమిపై మానవునికి సృష్టివలన అనుకోకుండా సంభవించిన కష్టకాలమా! లేక ప్రతి మానవుని స్వంత పాపకార్యములవలన సంభవించే అపాయకరమైన కాలమా? అనగా జన్మతః ఈ శాపలోకములోనికి ప్రవేశించిన ప్రతి మానవునికి ఉన్న కష్టకాలమా! స్వకీయ దురాశల వలన చేసిన పాపమునుబట్టి కష్టకాలమా! ఏది ఎక్కువ అపాయకరమైననూ మనము పట్టుదలతో ప్రార్థించిన యెడల ఈ రెండు విధములైన అపాయములు తొలగును. కష్టకాలమునకు కారణమైన పాపము ముందుగా పరిహారము కావలెను. పాపము మనలను దేవునికిని, మోక్షమునకును దూరస్థులనుగా చేయును. ఈ దుస్థితి ప్రార్థన వలననే అంతరించును గనుక దేవుని ప్రార్థించుడి. ప్రతి యింటిలోని వారందరు ప్రతి దినము దేవుని యెదుట మోకరించి ప్రార్థింపవలయును. దేవుడు పాపుల మొర వినునా? మన కష్టములు చూచి ఆయన యెందుకు ఊరుకొనుచున్నాడు? అను నట్టి ప్రశ్నలు కట్టివేసి ప్రార్థించుడి. ఇది మీరెందరిచేత చదివింతురో ఎందరికి వినిపింతురో! అన్ని దీవెనలు మీకు కలుగును.

**మా క్రైస్తవుల మనవి యిది:-** “అన్ని పూజలు మాని యేసుక్రీస్తు

ప్రభువును పూజచేసి చూడుడి. మీ ప్రార్థనలు సిద్ధించును.” దేవుడు మిమ్మును దీవించునుగాక!

క్రీస్తుప్రభువును పూజించుట వలన కలుగు మేళ్లు ఏవనగా? 1. ఎంత చిన్న తప్పు చేసినను అయ్యో! నేనెంత తప్పు చేసితిని అని నొచ్చుకొను నట్టి మనస్సు కలుగును. 2. పాపములు పరిహారమగును. 3. పాపములను విసర్జించునట్టి శక్తి కలుగును. 4. దైవభక్తి కలిగి, చక్కగా ప్రవర్తింపగల సమర్థత కలుగును. 5. ప్రార్థన చేసికొనువాలు కుదురును. 6. అన్ని సద్గుణములలో వృద్ధి కలుగును. 7. ఎన్ని కష్టములు వచ్చినను నిత్యము, మనశ్శాంతి గలిగియుండును. 8. దైవాంశములు సదా నేర్చుకొనవలెనని అపేక్ష కలిగియుండును. 9. దైవవిషయము లెప్పుడును ఇతరులకు చెప్పవలెనను ఆశ కలుగును. 10. అన్ని మతములవారును, అన్ని దేశములవారును, అన్ని జాతులవారును, శత్రువులును, స్నేహితులును, స్వజనులును, పరజనులును, సజ్జనులును, దుర్జనులును, రోగులును, బీదవారును, గొప్పవారును అందరును క్రీస్తు ప్రభువునే పూజింపవలెను అను కోరిక గలిగియుండును. 11. ఈ జీవాంతమున మోక్షములో చేరగల భాగ్యము కలుగును. ఈ మేళ్ళేనా? మరియే మేళ్ళును కలుగవా? గలుగకేమి? 1. జబ్బులు పోయి ఆరోగ్యము కలుగును. 2. అన్న వస్త్రాదులు కలిగియుందుము. 3. మానవ జీవితమునకు కావలసినవన్నియు దొరుకును. క్రీస్తుప్రభువును ప్రార్థించిన తరువాత సమస్తమును నెరవేరునని నమ్మవలెను. క్రీస్తు ప్రభువే మన ప్రార్థనలన్నిటికి నెరవేర్పయి యున్నాడు. క్రైస్తవుల ప్రార్థనలు ఎందుకు నెరవేరుటలేదు అని అడుగుదురేమో నమ్మికలోనో, నడతలోనో లోపముండుటను బట్టి నెరవేరవు. క్రీస్తును పూజించుటకు ఆయన ఎవరు? ఆకాశమును భూమిని నరులను సమస్తమును కలుగజేసిన దేవుడు, నరులకు కనబడి వారితో కలిసి మెలసియుండి వారి నిమిత్తమై నెరవేర్చవలసిన సమస్త కార్యములు నెరవేర్చుటకై మానవుడై జన్మించిన రక్షకుడు. ఆయన మానవావతార కాలమున యేసుక్రీస్తు అను నామమును ధరించెను. ఆయన ఒకరి రక్షకుడేకాదు. నమ్మువారందరి రక్షకుడునైయున్నాడు. మీకు శుభము కలుగునుగాక! ఆమేన్.

# 10. కుష్ఠరోగి బాగగుట

యేసుప్రభువు కొండెక్కి ప్రసంగముచేసి దిగి వచ్చుచుండెను. కొండక్రింద ఒక కుష్ఠరోగి ఆయన దగ్గరకు వచ్చి నమస్కారము చేసి "నీకిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవని చెప్పెను." మత్తయి 8:1-4. యేసు ప్రభువుయొక్క రెండు లక్షణములను అతడు కనిపెట్టెను. మొదటి లక్షణము ఇష్టము. రెండవ లక్షణము శక్తి. ఈ రెండు ఉన్నయెడల స్వస్థత జరుగును. ఒకని రోగము బాగుచేయుటకు ఈ రెండు లక్షణములు అవసరము. బాగుచేయుటకు ఇష్టముండి, శక్తి లేకపోయిన లాభములేదు. బాగుచేయుటకు శక్తి ఉండి ఇష్టము లేకపోయిన యెడల బాగుచేయరు. ఉదా:- 1.నీటిలోపడిన ముసలమ్మను లేవదీయుటకు ఒకనికి ఇష్టమున్నదిగాని ఈతరాదు. తానే మునిగిపోవుదునని భయపడెను. ఇష్టమున్నదిగాని శక్తిలేదు. మరియు 2. ఒక పేదవాడు ఉన్నాడు, ధనికుని దగ్గరకు వెళ్ళి సహాయము అడిగినాడు. ధనికునికి సహాయపడుటకు శక్తి ఉన్నదిగాని, ఆ దరిద్రునికి సహాయపడుటకు ఇష్టములేదు. పై రెండు కథలలోను కార్యము జరుగదు ఎందుకనగా ఒకరికి ఇష్టమున్నదిగాని శక్తిలేదు. ఒకరికి శక్తిగలదు గాని ఇష్టము లేదు. గనుక ఇష్టము, శక్తి రెండు లక్షణములు ఉంటేనే కార్యము నెరవేరును.

కుష్ఠరోగి కథలో యేసుప్రభువు బాగుచేయ శక్తిగలవాడని అతనికి తెలియును. బాగుచేయ శక్తిమంతుడని అతడు ప్రభువును మెచ్చుకొనెను. గాని ప్రభువునకు అతనిని బాగుచేయుటకు ఇష్టమున్నది లేనిది అతనికి తెలియదు. శక్తి ఉన్నదని అతడు గ్రహించెనుగాని ఇష్టమున్నది లేనిది గ్రహింపలేదు. రెండు ఉన్నప్పుడే రోగి బాగుపడును.

ఆ రోగికి ఒక విద్య ఉన్నది. అదేదనగా ప్రభువునకు శక్తి ఉన్నదని, ప్రభువు శక్తిగలవాడనే విద్య కుష్టరోగికి ఉన్నది. అప్పుడు ప్రభువు అతనికి తెలిసినది విడిచిపెట్టి, తెలియని క్రొత్తపాఠము నేర్పించెను. 'నాకిష్టమే' నీవు శుద్ధుడవుకమ్ము అను పాఠము నేర్పించెను. పాత నిబంధనలో పాపము చేసిన కుష్టురోగము వచ్చుననియు, అది శాపమనియు ఉన్నది. గనుక అతడు నేను పాపిని అందువలన శాపముగా వచ్చిన ఈ కుష్ఠు వ్యాధిని బాగుచేయుటకు ప్రభువునకు ఇష్టముండునా అని తలంచెను. గనుక ప్రభువు నీవు బాగుపడుట 'నాకిష్టమే' అను పాఠము నేర్పించెను. ఆ మాట ఆ రోగికి గొప్ప ఆదరణ. కుష్ఠరోగి నేర్చుకొన్న పాఠమేమనగా ఈయనకు శక్తికి శక్తియున్నది. ఇష్టమునకిష్టమూ ఉన్నది అని తెలిసికొనెను. అంతకుముందు ప్రభువునకిష్టమున్నట్లు అతనికి తెలియదు. అయితే అతనికి క్రొత్త సంగతి యేమనగా "నీవు శుద్ధుడవు కమ్మని" అతనిమీదనే భారము పెట్టెను. ప్రభువు బాగుచేస్తాడని రోగివస్తే, రోగిమీదనే ప్రభువు బాగుపడే భారము పెట్టెను.

పాతనిబంధనలోని నయమాను స్వస్థపడుటకూడ ఇటువంటిదే. ప్రవక్తయైన ఎలీషాకూడ ఈలాగుననే చెప్పెను. ఇక్కడికి ఈ దినము జబ్బులు బాగుచేయించుకొనుటకు వచ్చిన వారు మీరే మీ జబ్బులు బాగుచేసికొనవలెనా? లేక ప్రభువు బాగుచేయవలెనా? ప్రభువు రోగిమీదనే బాగుపడే భారము ఉంచినాడు గనుక మీకు మీరే బాగుపడవలెను. ఎందుకనగా మీరు బాగుపడవలెనని ప్రభువునకు ఇష్టమును మరియు శక్తియును రెండునూ గలవు గనుక బాగుపడవలెను. బాగుపడకపోతే మనదే తప్పు. యేసుప్రభువు కొండమీద ప్రసంగము చేసి దిగి వచ్చుచుండెను. ఇక క్రియ చేయవలెను. చేయకపోతే

ప్రసంగమేగాని క్రియలేదు అంటారు. లోకమునకు ఆయన, బోధకు బోధ చేయవలెను. క్రియకు క్రియ చేయవలెను. గనుక తెలియకుండ కుష్టరోగి వచ్చెను. ప్రభువు అతని బాగుచేసి క్రియ చూపించెను. బోధకులైనవారు బోధ చేయవలెను. రోగులను స్వస్థపర్చవలెను. ఇదే ఎమ్మాయు శిష్యులు చెప్పిరి (లూకా 24:19). అయితే ఆయన పునరుత్థానమును వారు నమ్మనందున ఆయన చనిపోయెనని వారు చెప్పిరి. కుష్టరోగి గొప్పవాడు ఎందుకనగా ప్రభువు శక్తిగలవాడని నమ్మెను. ఎమ్మాయు శిష్యులు నమ్మలేదు. గనుకనే ప్రభువు అవివేకులారా, మందమతులారా అని వారిని గద్దించెను. (లూకా 24:25). అట్లే ఈ వేళ జబ్బులు బాగుచేయించు కొనుటకు వచ్చినవారు బాగుపడకపోతే వారు అవివేకులు, మందమతులు. బాగుపడకపోవుట రోగుల తప్పుగాని, ప్రభువు తప్పుకాదు. ఈ కుష్ట రోగియొక్క పాఠములో కొన్ని జట్టులున్నవి.

1) ప్రభువునకు ఇష్టము, శక్తి రెండు లక్షణములు. ఇది ఒక రెండు.

2) మనము బోధ, క్రియ రెండునూ కలిగియుండవలెను.

3) గద్దింపులు రెండు అవివేకులు, మందమతులు,

4) అందరు బాగుపడవలెను, గాని కొందరే బాగుపడుదురు. ఇవి రెండు గుంపులు.

5) మత్తయి 8వ అధ్యాయము రోగులకు దేవుడు వ్రాసి ఇచ్చిన చార్టరు, లేక దస్తావేజు; మత్తయి ఉద్యోగము ఆకాలములో సుంఖపు పద్దువ్రాసేపని. ఆ పని విడిచిపెట్టి ఈ పద్దు వ్రాసినాడు. రోగులు ఈ అధ్యాయము బాగుగా చదువవలెను. ఇది క్రొత్త నిబంధనలోని దస్తావేజు. పాతనిబంధనలోని దస్తావేజు యెష్షయి 53అ॥ము. ఇందులోనిది క్రొత్తనిబంధనలో నెరవేరును. ఈ దస్తావేజులు రెండు.

6) కొందరు వెంటనే బాగుపడుదురు. కొందరు దారిలో స్వస్థత పొందుదురు (లూకా 17:14). ఇవి రెండు.

7) గొప్ప జబ్బు బాగుచేసినవాడు చిన్న జబ్బు బాగుచేయలేడా? ఇవి రెండు.

8) బోధ విన్నవారందరు బాగుపడరుగాని కొందరే బాప్తిస్మము పొందుదురు. అలాగే స్వస్థత కూటములలో అందరు నుందురు గాని కొందరే బాగుపడుదురు. ఇవి రెండు.

9) సువార్తికులు బోధ చెప్పి స్వస్థత ప్రాక్టిస్ (ఆచరణ) చేయవలెను. ఇవి రెండు.

*బోధించుట బోధకులపని, నమ్మట రోగుల పని, బాగుచేయుట ప్రభువుపని.*

మనిషి ఇష్టమునుబట్టి బాగగుట యుండును. యేసుప్రభువు బాగుచేయుటే అన్నిటికన్న గొప్పపని. మత్తయి 8అ॥లో ఏమేమి జబ్బులున్నవో తెలిసికొనండి.

10) నానావిధరోగులు లోకములో నున్నారు. లోకమునిండా మంచి ఉన్నది, చెడుగు ఉన్నది. ఈ రెంటిమధ్య మనిషి నిలువబడి యున్నాడు. మంచిని తెలిసికొనలేని నరుడు ఉండడు. దేవుడు మానవులను కలుగజేసి వారినెక్కడో పారవేసి ఆయన మోక్షములో కూర్చుండలేదు. అనాధలనుగా విడువనులేదు.

(మత్తయి 28:20) ఇదిగో యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నానని చెప్పిన ప్రభువు, (హెబ్రి 13:8)లో యేసు క్రీస్తు నిన్న, నేడు, నిరంతరము ఏకరీతిగా ఉన్నాడు అని వ్రాయించిన ఆయనకు మనలను నేడు స్వస్థపరచుటకు ఇష్టము, శక్తి ఉన్నవి గనుక చదువరులెల్లరకూ క్రీస్తు యేసు నామములో అట్టి కృప అనుగ్రహించును గాక! ఆమెన్.

# 11. గొఱ్ఱెల కాపరి

**ప్రభువైన యేసు చెప్పిన మాటలు:-** (యోహాను10:1-16) నేర్పరియైన గొల్లవాడు తన గొఱ్ఱెలను పచ్చికబైళ్ళుగల స్థలములలోనికి నడిపించును. అక్కడ గొఱ్ఱెలను తృప్తిగామేపి మరల తన స్వకీయమైన గొఱ్ఱెలన్నిటిని దొడ్డిలోనికి తీసికొని వెళ్ళునట్లుగా నేను మిమ్మును తీసికొని వెళ్ళుదును. ఏ గొఱ్ఱెకు ఏ పచ్చిక ఇష్టమో అది తెలిసికొని ఆ గొఱ్ఱెను ఆ పచ్చికగల స్థలములలోనికి నడిపించువాడను నేనే (యోహాను 10:7-8). ఒకవేళ ఏ గొఱ్ఱెయైన తన దారిని విడిచిన ఆ గొఱ్ఱెను పట్టుకొని వచ్చువరకు కాపరి నిద్రపోడు. ఆలాగే మీరు తప్పిపోయినప్పుడు మిమ్ములను శ్రద్ధతో వెదకువాడను నేనే. శ్రద్ధగా వెదకి పట్టుకొందును. నేను తప్పిపోయినవారిని వదలివేయను, పట్టుకొందును. అందరును త్రోవతప్పినవారే (యెష 53:6). గనుక అందరిని వదలివేయుదునా? వదలను. గట్టిగా పట్టుకొని నా సన్నిధికి తెచ్చెదను. ఏకాంత సన్నిధికి ఎవరురారో ఎవరు సన్నిధిచేయరో వారికి మహిమ తగ్గును. నేను సన్నిధికూటములకు వెళ్ళి ప్రతివారియొక్క పేరులను హాజరుపట్టిలో ఉన్న సన్నిధికూటస్థుల పేరులను పిలిచెదను. అప్పుడు క్రమముగా సన్నిధికి వచ్చినవారికి మంచి బహుమానము పరలోకములో ఇచ్చెదను. నాయొద్దకు వచ్చి తప్పిపోయిన బహుమానములు ఉండదు. వారిని భయపెట్టియో లేక ఏదో ఒకరీతిగానో రప్పించి సన్నిధిలో నిలిపెదను. ఒక దినమున సన్నిధిమానివేసిన యెడల మహిమ తగ్గిపోవును. అందుచేత మహిమ తగ్గకుండ చూచుకొన వలెను.

మనుష్యుని రక్షించుటకు రక్షకుడనైన నేను మనుష్యుని పోలికగాపుట్టి, దాసునిస్వరూపమును ధరించుకొంటిని, నా మొదటి రాకడకు కన్య మరియమ్మ బాగుగా సిద్ధపడినది. నా రాకకొరకు పరిశుద్ధ పరుపబడినది. గనుక ఆమెయొక్క గర్భమందు నేను జన్మించితిని. రాకడ తొందర అనగా ఏ విశ్వాసి రాకడకు సిద్ధపడునో ఆ విశ్వాసికి తప్ప మరెవ్వరికిని తొందర ఉండదు. ఏ విశ్వాసి యొద్దకైనను నేను వచ్చినప్పుడు పరలోకమందున్న బహుమానములలో ఒక బహుమానము తెచ్చి ఇచ్చెదను. విశ్వాసులను రాకడ విశ్వాసులను నేను విడిచిపెట్టను. ఏదో ఒకవిధముగా సన్నిధికి రప్పించెదను. దూతలందరు పరలోకముయొక్క మహిమ చూచుచున్నారు. వారందరు ఇప్పుడే ఆ మహిమను చూచుచున్నారు. మీరైతే నా మహిమను పూర్తిగా చూచుటలేదు. గనుక క్రమముగా నా మహిమను మీకు కనపరచి మిమ్మును పై అంతస్థుకు తీసికొని వెళ్లుదును. మీ తల్లిదండ్రులు భోజనము వడ్డించుచు ఉన్నప్పుడు మీరు ఆకడవరి పంక్తిలో ఉన్నను చివర ఉన్నను మూలన ఉన్నను అక్కడవరకువచ్చి శ్రేష్టమైన పదార్ధములు వడ్డింపరా? అలాగే మీతండ్రిగా బైలుపడిన నేను మీరు ఏమూలలో ఉన్నను అక్కడకు రాలేనా? వచ్చి మీకు కావలసిన వాటిని తృప్తిగా భుజించువరకు వడ్డించెదను. యీ సమయములో దేవదూతలు ఉన్నారు, ఇది ఎంతగొప్ప దైవసహాయము. దేవదూతలు మీపనికొరకు ప్రతినిమిషము కనిపెట్టుచుందురు. ఎందుకనిన మీరు దైవసన్నిధిచేయువారు గనుక మీయందరికొరకు వారు కావలిబంటుల వలె ఉందురు. ప్రార్ధనపరులు అనగా నా నామమును ఎత్తి స్తుతించువారు నాకు ప్రార్ధన చేయకముందే విని వారికోర్కెలు తీర్చగల వాడను గనుక మీకెల్లప్పుడును

సంతోషముగానుండును. మీ మహిమకు కారణము నేనే. గనుక మీకు సంతోషము. ప్రియబిడ్డలారా ఎప్పుడు నన్ను పిలచెదరో అప్పుడే మీమధ్యకు వచ్చి నిలిచియుందును. మీరు నన్ను పిలుచుటయే ఆలస్యము. ప్రతి శ్రమకును మీకు మహిమ రాకపోదు. ప్రతి విశ్వాసికిని తగిన శ్రమలు ఉండును. శ్రమలులేని విశ్వాసులులేరు. ఆలాగే మహిమలేని విశ్వాసులునులేరు. గనుక శ్రమకుతగిన ప్రతిఫలము మహిమయై ఉండును. మీరు మహిమకొరకు ప్రయాసపడుచున్న యెడల శ్రమ దానంతట అదే వచ్చును. నా ప్రియబిడ్డలను ప్రేమించుడి అదియును మహిమకు కారణమే. మీయొద్దకు ఎవరు వచ్చినను వారికి రాకడను గురించి బోధించండి, బోధ మీ పని.

భూకంపము రానైయున్నది. మీరు నా సన్నిధిలో దాగుకొనవలెనుగదా? కీర్తన 32:7 మీరు తండ్రిని కలిగియున్న బిడ్డలు. తండ్రిని హత్తుకొనిన కుమారులును కుమార్తెలునైయున్నారు. తండ్రిని విడిచి స్వేచ్ఛగా తిరిగిన వారికి శ్రమ గాని మీకేమియు ఉండదు. సుఖమే సంతోషించి ఆనందించండి. పరలోకమందు మీ ఫలము అధికమగును. త్రైక దేవుని దీవెనలు మీకు కలుగునుగాక! ఆమేన్.

Bible Mission HQ Guntur

# 12. సహింపు దానము

సిలువమీద యేసుప్రభువునకు శరీరమంతటను గొప్ప బాధ ఉన్నప్పటికిని మన నిమిత్తమై శ్రమపడుటకు వచ్చినందున సహించెను. బిడ్డల నిమిత్తమై కష్టములు వచ్చినప్పుడు తల్లిదండ్రులు సహింతురు. ప్రభువు సహించిన సహింపు ఒక ఇంటిలోని బిడ్డల నిమిత్తము మాత్రమే కాక సర్వలోకమందలి ప్రజలందరి నిమిత్తమై సహించెను. గనుక ఈ సహింపు గొప్ప అద్భుతకరమైన సహింపు. (1) రక్తబాధ కలిగినపుడు హింసకులను దూషింపలేదు, శపింపలేదు. "ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు; ఆయన శ్రమపెట్టబడియు బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్నుతాను అప్పగించుకొనెను." (1పేతురు 2:22,23.) క్రీస్తు ప్రభువు సహింపునకు గొప్ప మాదిరి. *శత్రువులవలన బాధలు కలుగుచుండిన యొక విసుగుదల కలిగిన మనుష్యునితో నొకబోధకుడు ఇట్లనెను:–* "నీ పగవారు బరువైన సిలువ నీ భుజముమీద ఎత్తలేదుగదా, నిన్ను ఊరివెంట తిప్పలేదుగదా, తత్పూర్వము నీ కాళ్ళలో మేకులు కొట్టలేదుగదా, నీ చేతులు కొయ్యకు అంటగొట్ట లేదుగదా, నీ తలమీద ఉన్న కిరీటము గుచ్చలేదుగదా, నీ ప్రక్కలో పొడవలేదుగదా, నీకెందుకింతకోపము, నీకెందుకింత విసుగుదల, సహింపునకు మాదిరియైన క్రీస్తుప్రభువు యొక్క సహింపును జ్ఞాపకము చేసికొని సహింపరాదా? అప్పుడు నీ మనస్సునకు శాంతి కలుగదా? (రోమా 12:19,20.) (3) దానము– అందరివలెకాక క్రీస్తుప్రభువు తనరక్తమునే, తన ప్రాణమునే మనకు దానముగానిచ్చెను. అందువలన

విశ్వాసమునుబట్టి మనకు శుద్ధి, శక్తి, జీవము కలుగును. స్నేహితులు ఏదైన యీయగలరు. ప్రాణమును యీయగలరా? ఒకవేళ ఇస్తే లోకములోనున్న అందరికొరకు యీయగలరా? ఇవ్వలేరు, చాలదు. ప్రభువు ప్రాణ త్యాగముచేసిన వారిలో గొప్పవాడు. మీరు ఎందుకు క్రీస్తును మెచ్చుకొనుచున్నారు అని గాంధీగారిని అడిగినప్పుడు "ఈయనవలె త్యాగముచేసినవాడు మరియొకడులేడు" అని జవాబిచ్చెను. సహింపును, త్యాగమును కలిసియున్నవి. విడదీయ వీలులేదు. "తన ప్రాణమును నా నిమిత్తమై పోగొట్టుకొనువాడు దానిని సంపాదించు కొనుననియు తన నిమిత్తమై దానిని సంపాదించు కొనువాడు పోగొట్టుకొనుననియు" ప్రభువు చెప్పెనుగదా! (మత్తయి 16:25.)

ప్రతి కష్టస్థితిలోను, పాపశోధన స్థితిలోను, ప్రభుని పునరుత్థానము తలంచుకొని పునరుత్థాన బలముపొంది లేవవలెను. నేను చనిపోయినను ప్రభువువలె లేచెదను అను నిరీక్షణతో బ్రతుకవలెను. సిలువ శ్రమ మరణము సమాధి ఉన్నప్పటికిని ప్రభువులేచి వచ్చెనుగదా!

అట్టి దీవెన ప్రభువునందు నిరీక్షణ గల వారందరికీ అనుగ్రహించును గాక! ఆమెన్.

Bible Mission HQ Guntur

# 13. రక్షణ పత్రిక

నా పత్రికలున్న దీనిలో దేవవాక్యమున్నది; పాడుకానీయకండి.

**(1) దేవలోకము:-** దేవుని సింహాసనస్థలము (యెషయా 66:1) **(2) దేవదూతల లోకము:-** (యోబు 38అ) మన కావలిబంటులైన వీరిచోటు (హెబ్రీ 1:14). **(3) మోక్షలోకము:-** (యోహాను 14:2) మృతులైన భక్తుల నిత్యనివాసము. **(4) సాతాను లోకము:-** (ఎఫెసీ 6అ) ఇతడును, ఇతని దూతలును ఉండు ప్రదేశము **(5) భూలోకము:-** (ఆది;1) (1) ఈ పరిశుద్ధలోకము సైతానువలన పాపమయమాయెను. (2) కొన్ని ఏండ్లకు దేవుడే యేసుక్రీస్తను నరుడుగా భూమిమీద వెలసెను (లూకా 2అ) ధర్మములు బోధించి, అద్భుతోపకారములుచేసి, అవమానములపాలై శత్రువుల వలన హతమై, బ్రతికివచ్చి మోక్షమునకు వెళ్ళెను. (కార్య 1అ) వెళ్ళకముందు ఆయనచెప్పిన మాటలు: నా మాటలు నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, (మార్కు 16అ) గుర్తులు అయిన పిమ్మట నేను వచ్చెదను (మత్త 24అ) పిమ్మట శిష్యులు ఆయననుబట్టి క్రైస్తవమతమును స్థాపించిరి (కార్య 11:15) క్రీస్తు మేఘాసీనుడై నేడే అన్నంత త్వరగా వచ్చి భక్తులకు చావులేకుండచేసి వారిని మోక్షమునకు ఆకర్షించుకొనును. ప్రార్థనాపూర్వకముగా సిద్ధపడండి (1థెస్స 4అ) సిద్ధపడనివారికి ఏడేండ్లు శ్రమలు; (ప్రక 6అ) క్రీస్తువచ్చి హింసకుడగు విరోధిని అతని సహాయకులను నరకములోపడవేయును. సైతానును వెయ్యేండ్లు గోతిలో బంధించును. (ప్రక 20అ) **(6) మారినభూమి:-** (ప్రక 20:6). 1. అపుడు క్రీస్తు పరలోక వాస్తవ్యులతో వచ్చి వెయ్యేండ్లు శాంతిపాలన చేయును. పాపము చేసినవారు ఉందరు

గనుక పాపకార్యములు ఉండవుగాని నైజపాపము గలవారుందురు. వారికి క్రీస్తు బోధ వినబడును. నరులు వందలాది ఏండ్లు సుఖముగా బ్రతుకుదురు. పురుగులబాధ, మృగములబాధ ఉండదు. 2. బోధవిన్నవారి తీర్మానమును క్రీస్తు చెప్పించి తీర్పు విధించును. 3. క్రీస్తు సైతానుకు విడుదల కలుగజేయగా అతడు యుద్ధముచేసి ఓడిపోయి నరకములో పడును. (ప్రక 20:7-10). అతనితోపాటు నమ్మనివారుకూడ నరకము పాలగుదురు. (ప్రక 20:15). **(7) హేడెస్సు:-** పాతాళ లోకము. మారని మృతులుండు గొయ్యి. నశించినదానిని రక్షింపవచ్చిన క్రీస్తు వీరికి గడువియ్యక విడిచిపెట్టునా? (1సమూ. 2:6; 1పేతు 4:6). **(8) క్రొత్తభూమి:-** అప్పుడు భూమి మోక్షములో ఒక భాగమగును. అన్ని లోకములలో క్రీస్తే ఉండును (ప్రక. 21అ).

బోధ:- (1) **బైబిలు:** దీనిలో దేవునిమాటలున్నవి చదువండి. మంచిమాదిరిని అవలంభించుటకు సజ్జనుల చరిత్రయును, చెడ్డ మాదిరిని విసర్జించుటకు దుష్టుల చరిత్రయును దీనిలో గలవు.

(2) **క్రీస్తు చరిత్ర:** ఈయనవలన మాత్రమే నరులు పాపపరిహారము పొంది మోక్షమునకు వెళ్ళగలరు. (కార్య. 4:12). పాపములు విసర్జించి ఇతరపూజలు మాని ఈయననే ఆశ్రయించువారికి కోరికలన్నియు తీరును.

(3) **క్రైస్తవమతము:** ఇది అన్నిమతములను పిలుచుచున్నది. అన్ని దేశములలో వ్యాపించుచున్నది. బైబిలును (ఇప్పటికి 1958 సం॥ము వరకు) ఒక వెయ్యి నూట ఏబది భాషలలో ప్రచురించినది.

(4) **బైబిలు మిషను:** (1) రాజమండ్రిలో 1938వ సం॥ము జనవరి మాసమున దేవుడు 'బైబిలుమిషను' అని గాలిలో వ్రాసి నాకు

చూపెను గనుక "బైబిలుమిషనును" ఎత్తిచూపుమని చెప్పెను గనుకను దీనిని వెల్లడిలోనికి తెచ్చుచున్నాను. (2) ప్రార్థనలో క్రీస్తు కనబడి బైబిలు వచనముల వివరము చెప్పుననియు, బైబిలులోని అద్భుతములు అక్కరలనుబట్టి నేడుకూడ జరుగుననియు బోధించుచున్నాము. (3) ఇతర మతములను మాత్రమేగాక ఇతర మిషనులనుకూడ దేవుడు బైలుపరచిన ఈ బైబిలుమిషనులోనికి రండని పిలుచుచున్నాము. (4) బైబిలు మిషనును దేవుడు పేరువ్రాసి బైలు పరచినందునను, ఎత్తిచూపించుమని చెప్పినందునను, దేవుడు స్వయముగా బైబిలును మిషనెరీవలె " బైబిలు మిషను వారికి" వివరించుచున్నందున ఇది అన్నిటికంటె పై అంతస్థుగలదైయున్నది. ఇతరులకు రక్షణలేదని మేము చెప్పము. విశ్వాసులందరికి రక్షణగలదు (ఎఫెసీ 2:18) బైబిలు మిషను సేవార్థమైన మాలో జీతముల ఏర్పాటులేదు.

(5) **దైవ ప్రార్థన విషయములు:** ప్రార్థనలో ఉండి దేవునియెదుట పాపము లొప్పుకొనండి; మేళ్ళ నిమిత్తమై స్తుతించండి; మీ యిష్టము వచ్చిన మనవులు చెప్పుకొనండి జవాబుకొరకు కనిపెట్టండి.

(6) **స్వస్థిశాల:** ఇది గుంటూరువద్దనున్న శ్రీ రావుసాహెబ్ జె. రాజారావుగారి కాకానితోటలో ఉన్నది. ఇక్కడికి ప్రతి సోమవారము నలుగురు బైబిలుమిషను పాదుర్లు వచ్చి, క్రీస్తుబోధలు, ప్రార్థనలు, కీర్తనలు నేర్పింతురు. పాపులకు, రోగులకు, బిడ్డలు లేనివారికి, భూత పీడితులకు, చిక్కులలో ఉన్నవారికి, పశ్వాదులకు మేలు కలుగుచున్నది. ఈ పని బైబిలు వాక్యానుసారమే. స్వస్థికూటములందరును పెట్టుకొనవలసినదే.

Bible Mission HQ Guntur

(7) **(1) దైవసన్నిధి కూటములు:-** ఈ 1957 లో తెలుగు జిల్లాలయందు ఈ కూటములు స్థాపింపబడినవి. క్రీస్తుప్రభువు దర్శనములో కనబడి ప్రశ్నలకు జవాబులు చెప్పును. దేవదూతలను, మోక్షలోక భక్తులను పంపును. వారును మాటలాడుదురు. భూలోక విశ్వాసుల ఆత్మలను, మారని ఆత్మలను కోరినవారిని పంపును. ఒకానొకప్పుడు భూతములనుకూడ రానిచ్చును. తర్వాత ఆయనవచ్చి భూతముల మాటలు నమ్మవద్దనియు, వాటికి భయపడవద్దనియు చెప్పి ఆదరించును. ఇట్టి కూటములు లోకములోని ప్రతి ఇంటిలో పెట్టుకొనవలెనని కోరుచున్నాను. దేవుడు మీకు కనబడి మాట్లాడుట ఇష్టములేదా? ఇది శక్తిపూజకాదు దైవపూజ. (యెషయా 8:19). (2) క్రీస్తు నిమిషములమీద వచ్చుచున్నాడు, వచ్చుచున్నాడు, వచ్చుచున్నాడు అని ఎంతచెప్పినను, యెన్ని మారులు చెప్పినను లక్ష్యపెట్టనివారు ఒకమారు బైబిలంతయు చదువవలెననియు, ముఖ్యముగా ప్రకటన పుస్తకము నేర్చుకొనవలెననియు, నిత్యము ఆయన రాకడ తలంపు మీదనే ఉండుట శ్రేయస్కరమనియు, రాకడను గురించి బోధించుమని దేవుని నడుగవలెననియు, క్రైస్తవమతముమీద ద్వేషభావము కలిగించుకొనకుండుట క్షేమమనియు, సర్వజనసంఘము మీద మాకున్న అభిమానము చొప్పున సలహా ఇచ్చుచున్నాము.

(8) **మరికొన్ని విషయములు:-** (1) దేవా! సైతానును అతని దూతలను, అతనిని అనుసరించిన కఠినాత్ములను నీ శక్తిచేత బలవంతముగా మార్చి నరకములేకుండగచేసి మోక్షమునందు గాకపోయినను మరియొక స్థలమునందైనను చేర్చి రక్షించుము ఆమేన్. అని నేను ముప్పదియేండ్ల క్రిందట ఈ తిరుగుబాటు ప్రార్థనచేసి ఇప్పుడు మానివేసితిని.

(2) ప్రార్థన:– దేవా! నాకు కనబడుము; నాతో మాటలాడుము; అందరికిని కనబడుము; అందరితోను మాటలాడుము; స్వప్నములోను, దర్శనములోను అందరికి సత్యమార్గమును బోధించుము. బోధను అనుసరించు శక్తిని కలిగించుము. విగ్రహారాధన, శక్తిపూజ, ఇతర దేవతలపూజ కూడదని బైబిలులో వ్రాయించినావు గనుక ఇవి మాన్పించుము. మానవులకు హానికలిగించు పనిముట్లను వాడనీయకుము. కులనిష్ట ఎడబాపును ద్వేషభావమును కలిగించును గనుక దానిని రద్దుచేయుము. సోదరభావమును హెచ్చింపుము, మెరకను, నీటను, అంతరిక్షమునకును ప్రయాణము చేయువారికిని, భూగర్భమున పనిచేయువారికిని నీ దూతలను సహాయముగానిమ్ము. పాపులను, బీదలను, రోగులను, బిడ్డలు లేనివారిని, భూతపీడితులను, పెండ్లి సమకూడనివారిని, కుటుంబ కలహములు గల వారిని, వర్తక నష్టముగలవారిని, అప్పులపాలైనవారిని ఇండ్లు లేనివారిని, దేశదిమ్మరులను, భిక్షకులను, అన్యాయము పాలగువారిని పనులు ఉద్యోగములు దొరకనివారిని, ఉపకారులను, ఆయా అవస్థలలో నున్నవారిని కనికరించుము. మా విరోధులను క్షమించుము, దీవించుము. నిన్ను ఎరుగనివారికి బైలుపడుము. విద్యాభివృద్ధి, నాగరికతాభివృద్ధి, దైవభక్తి వృద్ధి ప్రబలపరచుము, సమస్త జీవులను, వృక్షాదులను నీవు కలుగజేసిన సమస్తమును అనుదినము దీవించుచుండుము. సైతాను ప్రయత్నములను, సైతాను అనుచరుల దుష్ట ప్రయత్నములను నెరవేరనీయకుము. పరదేశ ద్వేషమును, పరవస్తు ద్వేషమును, దురాచారములను, అనాచారములను మాన్పించుము. ఉపయోగకరమైన వృత్తులను సాగనీయుము.

నరులలో ఎవరును నరకములోనికి వెళ్ళకుండ రక్షింపబడగల గడువు వారికి దయచేయుము అని నీ దివ్య లక్షణములను బట్టి నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము ఆమేన్.

(3) ప్రియులారా! ఎప్పుడైనా ఎక్కడైనా దేవుని తలంపుకలిగి యుండండి అన్నిటిలో దేవుని స్తుతించండి అప్పుడే మీకు దేవుని దీవెనకలుగును. మీకంటబడు క్రొత్తవారిని చూచి దేవా! వారిని అధికముగా దీవించుమని మీ మనస్సులో ప్రార్థించండి. మీకు దేవునివలన బహుమానము కలుగును. అధికారులకు న్యాయము జరిగించు జ్ఞానోదయము అనుగ్రహించుము. కష్టస్థితిలో నున్నవారిని, అకాలమరణము గలవారి స్వకీయులను, ఆకస్మికమరణము గలవారి స్వకీయులను ఆదరించుము అని ప్రార్థించుడి. చదువరులారా! వినువారలారా! మేలు చేయు దేవుడు మనకు కలడు గనుక దిగులుపడకండి. భయపడకండి, చింతించకండి. అపనమ్మిక కలిగి యుండకండి, కాని ఎల్లప్పుడు సంతోషించుచుండండి.

ఈ దిగువనున్న మతములలో క్రైస్తవ మతమునకే ఎక్కువ ఆటంకములు, విరోధములు, శ్రమలు ఎందుకనిన ఇది అదివరకున్న మతముల యొద్దకు వెళ్ళుచున్నది గనుక.

ప్రపంచములోని మతములు:

(1) క్రైస్తవులు: ఎనుబదికోట్ల నలుబది మూడు లక్షల ఆరువేల ఎనిమిదివందలు. (2) రోమన్ కతోలిక్కులు: నలుబది ఏడు కోట్ల, ఎనిమిదిలక్షల, ఏబది రెండువేల తొమ్మిదివందల ముప్పది నాలుగు, (3) తూర్పు అర్థడాక్సు: పన్నెండుకోట్ల ఎనభై ఎనిమిదిలక్షల ఎనుబది ఏడువేల తొమ్మిదివందల పదిహేడు, (4) ప్రొటెస్టాంటులు: ఇరువదికోట్ల నలుబది ఐదు లక్షల అరువది ఆరువేల తొమ్మిది.

(5) యూదులు: ఒకకోటి పదునెనిమిది లక్షల అరువది ఆరువేల అరువందల ఇరువది. (6) ముస్లిములు: నలువది ఒకకోటి అరువది ఐదు లక్షల డెబ్బదివేల ఇరువది ఎనిమిది. (7) జోరాస్ట్రియన్లు: ఒకలక్ష నలువదివేలు, (8) షింటోలు: మూడుకోట్లు, (9) టోయిష్టులు: ఐదుకోట్ల ఏబది మూడువేల రెండువందలు, (10) కన్ఫూషియనులు: ముప్పదికోట్ల రెండులక్షల ఐదువందలు, (11) బౌద్ధులు: పదిహేనుకోట్ల మూడు లక్షల పదివేలు, (12) హిందువులు: ముప్పై ఒకకోటి ఏబది తొమ్మిది లక్షల తొంబది తొమ్మిదివేల నాలుగువందల ఐదు, (13) ఆదిమ నివాసులు: పన్నెండుకోట్ల పదకొండు లక్షల ఏభైవేలు, (14) ఇతరులు: ముప్పైకోట్ల అరువది రెండులక్షల నలభై ఏడువేల తొమ్మిదివందల ఇరువది ఏడు. మొత్తము: మూడువందల ముప్పది ఒకకోటి పదకొండు లక్షల ఏభై ఒక్కవేల మూడువందల నలుబది.

ఈ సంఖ్యలో క్రైస్తవుల సంఖ్యయే ఎక్కువగానున్నది. ఎందుకనిన క్రైస్తవబోధ అన్ని దేశములకు వినిపింపవలెనను ఒక ఏర్పాటు ఉన్నందున, క్రైస్తవులు కష్టపడి అన్నిదేశములకు వెళ్ళి మతమును ప్రకటించినారు. ఇప్పుడు (1960) క్రైస్తవులు ఎనుబది కోట్ల నలభై మూడులక్షల ఆరువేల ఎనిమిదివందలు. కాని గడిచిన పందొమ్మిదివందల ఏండ్లలోను ఎందరు క్రైస్తవులు అయినారో ఆ లెక్క చూచినయెడల ఈ లెక్కకంటె ఎన్నోరెట్లు ఎక్కువగానుండును. **క్రీస్తుమతము ప్రకటనమతము, సర్వజనోపకార మతము** గనుక ప్రతిపర్యాయము జనసంఖ్య ఎక్కువకాకమానదు. క్రైస్తవమతము వృద్ధిపొందుచున్న మతము గనుక వృద్ధికోరువారందరు దీనిలోనికి రావలసినదని బైబిలునుబట్టి చెప్పుట న్యాయమే. క్రీస్తుప్రభువు

జన్మించుటకై ఏర్పడిన జనాంగము యూదుల జనాంగము. ఈ యూదులకే ఇశ్రాయేలీయులు అను పేరుకూడగలదు. వీరు ఆదిలో పన్నెండు గోత్రములవారు. ఆ గోత్రములలోని యూదాగోత్రపు జనసంఖ్య తక్కిన గోత్రముల జనసంఖ్యకంటె ఎక్కువ. ఆ ఎక్కువలో యూదాగోత్రములో జన్మించిన క్రీస్తునుబట్టి స్థాపితమైన క్రైస్తవమత జనసంఖ్యకుకూడ వచ్చినది. ఇది ఆ శాఖలోనిదే గనుక దాని దీవెన దీనికిని కలిగినది. ఈ ప్రజలు లెక్కింపబడిన సం॥ము క్రీస్తునకు ముందు 1490 (సంఖ్యా. 2:9; 26:22).

దైవసంకల్పనచేత వేరొకమతములోనికి ఆకర్షించువరకు ప్రతివారును తమ మతములో నిలకడగానుండుట యుక్తమైయున్నది. వేరొక మతములోనికి దైవసంకల్పననుబట్టి వెళ్ళితినని ఋజువుపరచుకొను వారిని మనము ఆపేక్షింపకూడదు. వేదాంత పండితులు, ఇతర శాస్త్రపండితులు, పరోపకార సాధనములు కల్పించుచున్న నేర్పరులుకూడ ఎక్కువే. బైబిలు ప్రచురమైన భాషలు, ప్రతులు, వ్యాఖ్యానములు, కరపత్రములు కూడ ఎక్కువే. అందరికొరకు జరుగు ప్రార్థనలు ఎక్కువే, దేవాలయములు ఎక్కువే. ఈస్టరుపండుగ దీవెనలు మీకు కలుగునుగాక! ఆమేన్.

# 14. రక్షణ పిలుపు

దీనిలో దేవుని వాక్యమున్నది. పాడుకానీయకండి. దేవుడు మిమ్మును దీవించునుగాక.

1. **దేవలోకము:–** ఇది అన్నిలోకములకు పైన ఉన్నది. దేవుడు ఆది అంతములేనివాడు. నిరాకారుడు, జ్ఞాని, పరిశుద్ధుడు, శక్తిమంతుడు, ప్రేమాస్వరూపి, న్యాయస్థుడు, సర్వవ్యాపి, స్వతంత్రుడు, మనతండ్రి. యెషయా 6:3.

2. **దేవదూతల లోకము:–** దేవుడు వీరిని మొదట కలుగజేసెను. వీరు నిరాకారులు, పరిశుద్ధులు, మనలను కాపాడువారు. యోబు 38:7.

3. **మోక్ష లోకము:–** భూమిమీద భక్తిగా జీవించినవారు చనిపోయిన తరువాత ఇక్కడకు వత్తురు. భక్తిలో ఎక్కువ తక్కువలు గలవు గనుక ఇక్కడ వారు తమతమ తరగతిలోనే ఉందురు. 1కొరిం. 15:23.

4. **వాయుమండల లోకము:–** దేవునికి భిన్నముగానుండిన దూత సైతానుగా మారినందున తన జట్టుతోపాటు ఇక్కడకు వచ్చి వేయవలసివచ్చెను. ఎఫెసీ. 6:12.

5. **భూలోకము:–** ఆది. 1 అధ్యాయము. (1) దేవుడు మన సదుపాయము నిమిత్తమై ఆకాశమును భూమినిచేసెను. పిమ్మట మన ఆది తల్లిదండ్రులను కలుగజేసెను. సైతానుమాట విన్నందున వారు పాపాత్ములైరి. సర్వలోకమును రక్షించుటకై ఒక రక్షకుని పంపితునని దేవుడు వారికి వాగ్దాన మిచ్చెను. ఆయన రాకడకు ఎదురుచూచినవారు ధన్యులైరి. దేవుడు కనబడనందున చాలమంది సృష్టిని పూజించిరి. కొందరు దేవుని పూజించిరి. అప్పుడు దేవుడు యూదులను నియమించి సమస్త ధర్మములు వారికి బోధించెను. వారు అవి

వ్రాసిపెట్టి ఉంచిరి. ఇదే బైబిలులో మొదటిభాగము. వారు ఇతరులకు అవి బోధింపవలెను.

(2) వారిలో రక్షకుడు పుట్టవలెను. నాలుగువేల యేండ్లకు దేవుడు కన్యకా గర్భమున శరీరధారిగా జన్మించి యేసుక్రీస్తు అను నామమున ప్రసిద్ధికెక్కెను. ఈ పేరునకు లోకైకరక్షకుడు అని అర్థము. ఆ దేవనరుడు అనేక విషయములు బోధించెను. మంచి మాదిరి చూపెను. పాపులకు క్షమాపణ వినిపించెను. రోగులను స్వస్థపరచెను. ఆకలిగొన్నవారికి ఆహారము కల్పించెను. ఆపదలోనున్నవారిని తప్పించెను. మనుష్యులలోని దయ్యములను వెళ్ళగొట్టెను. మృతులను బ్రతికించెను. తనబోధ సమస్త జనులకు వినిపించుడనియు, నమ్మి బాప్తిస్మముపొందినవాడు రక్షింపబడుననియు, నమ్మనివారికి శిక్ష విధింపబడుననియు, నేను వచ్చి మిమ్ములను తీసికొని వెళ్ళెదననియు, ఆయన ఈ లోకములో నున్నప్పుడే చెప్పివేసెను. ఆయన రెండవ రాకడకు ముందు భూకంపములు మొదలగు గుర్తులు జరుగుననికూడ చెప్పెను. లోక పాపములను తనమీద వేసికొని తనప్రాణము సమర్పించుటకై వచ్చెను. గనుక శత్రువులు ఆయనను చంపగా చంపనిచ్చెను. గాని మూడవ దినమందు బ్రతికివచ్చి నలుబది దినములు శిష్యులకు బోధచేసి మోక్షలోకమునకు మహిమశరీరముతో వెళ్ళిపోయెను. ఆయన రాకడ గుర్తులు ఇప్పుడు జరుగుచున్నవి. గనుక ఆయన రెండవ రాకడ వాగ్దాన ప్రకారము త్వరలో సంభవించును(1థెస్స 4:15-17). రాకడ దినమున క్రీస్తునందు మృతులైనవారు మొదట మేఘములోనికి లేచివెళ్ళగా సజీవులమైన మనము తరువాత వారిని కలిసికొని మోక్షమునకు వెళ్ళుదుము. రాకడ ఎప్పుడో తెలియదు, గనుక మీ హృదయములలో దైవాత్మ ప్రవేశించునట్లు అనుదినము ప్రార్థించుచు సిద్ధపడండి. దైవాత్మ

మీలోనికి వచ్చినపుడు మీకు ఉద్రేకము మహానందము మహాశక్తి. క్రీస్తుప్రభువు బోధ ప్రకటించుటకు వాక్కు కలుగును. మరియు కొన్ని వరములుకూడా దైవాత్మవలన మీకు లభించును. మీరు పరలోకమునకు సుళువుగా వెళ్ళగలరు. పరలోకమందు భక్తులందరికిని ఏడేండ్ల విందు జరుగును.

(3) భూమిమీద మిగిలిపోయినవారికి ఏడేండ్లు సైతానుయొక్క ప్రతినిధియగు క్రీస్తువిరోధివల్ల అనేక హింసలు కలుగును. అప్పుడు 144వేలమంది యూదులును, కోట్లకొలది యితరులును, ప్రభువుతట్టు తిరుగుదురు గాని ఇంకను చాలమంది తిరుగరు. తుదకు క్రీస్తునకును, అంతెక్రీస్తు అను బిరుదుగల విరోధికిని పాలస్తీనా దేశములో హర్మగెద్దోనువద్ద యుద్ధము జరుగును. అప్పుడు విరోధిని, అతని పనివారిని క్రీస్తుప్రభువు నరకములో పడవేయును. సైతానును పాతాళములోని వెయ్యేండ్ల చెరలో బంధించును కాని మారడు.

(4) తరువాత క్రీస్తుప్రభువును పరలోక వాస్తవ్యులును ఈ భూమిమీదికి వచ్చి ఆ వెయ్యి ఏండ్లును శాంతి పరిపాలన చేయుదురు. సైతాను ఉండడు గనుక భూమి శుభ్రముగా నుండును. నరులు పాపకార్యములు చేయరు గనుక కొందరిలో పాపనైజము మాత్రమే మిగిలియుండును. వారికి క్రీస్తుబోధ ముమ్మరముగా వినబడును. సర్వత్ర దైవారాధన జరుగును. అనేకులు మారిపోవుదురు. అయినను మారని వారును ఉందురు. ఇప్పుడున్న కష్టములేవియు అప్పుడుండవు. నమ్మినవారు నమ్మనివారు మహాసౌఖ్యమనుభవింతురు. నీళ్ళు పరిశుభ్రముగా నుండును. భూమి బహుగా ఫలించును. జంతుబాధలు, పురుగుబాధలు, వ్యాధులు ఉండవు. మనుష్యులు వందలాది యేండ్లు బ్రతుకుదురు.

(5) అప్పుడు వెయ్యేండ్ల బోధవిన్నవారు ఏమి తీర్మానించుకొనిరో చెప్పించుటకు క్రీస్తుప్రభువు ఈ భూమిమీద సింహాసనము వేసికొనును.

(6) వెయ్యేండ్ల అంతమందు సైతానుకు విడుదల కలుగగా అతడు భూమిమీదికి ఉగ్రుడైవచ్చి తనపక్షముగనున్న మనుష్యులను గొప్ప సేనగా నియమించుకొని దేవునితో యుద్ధముచేసి ఓడిపోయి నరకములోనికి పడద్రోయబడును.

(7) పిమ్మట క్రీస్తుప్రభువు సమాధులలో నున్నవారిని రప్పించి తీర్పుచెప్పి నరకమునకు పంపివేయును. ఇదే కడవరితీర్పు. చివరగడియలో కూడ ఎప్పుడైన ఎక్కడైన మారినవారు నరకమునకు వెళ్ళరు.

(8) అప్పుడు భూలోకము మోక్షలోకములో ఒక భాగమగును. నమ్మినవారందరియొద్ద క్రీస్తు ప్రభువు నిత్యము ఉండును. మహానందము, మహావిశ్రాంతి, మహాసౌఖ్యము.

6. పాతాళలోకము:- (1) హేడెస్సు: భూలోకములో మారకుండ చనిపోయిన వారు ఇక్కడ కడవరి తీర్పువరకు ఉందురు. ఆ తీర్పు కాకముందు ఎవరును నరకములోనికి వెళ్ళరు. మారుటకై ప్రతివారికిని ఎక్కడో ఒకచోట ఎప్పుడో ఒకప్పుడు ఏవిధముగానో ఒక విధముగ దేవుడు సమయమిచ్చును. క్రీస్తుప్రేమను తృణీకరించువారు ఎక్కడను మారరు.

(1) చెర: ఇక్కడ సైతాను వెయ్యేండ్లు ఉండును.

(2) నరకము: ఇది కడవరి తీర్పుకాలమున కనబడును. తీర్పు జరుగునప్పుడు క్రీస్తుకాక మరియెవ్వరును వెళ్ళరు.

# ఉపదేశము

1. బైబిలు: ఇది 1135 భాషలలోనికి వచ్చినది. గనుక ఇది దేవుడు సర్వలోకము నిమిత్తము పంపిన గ్రంథమని గ్రహించుకొన వచ్చును. దీనిలో సృష్టిచరిత్ర, క్రీస్తురాకముందు జరిగిన చరిత్ర క్రీస్తు వచ్చిన తర్వాత జరిగిన చరిత్ర, ఆయన వెళ్ళిపోయిన చరిత్ర, క్రైస్తవ సంఘములో జరిగిన ప్రారంభ చరిత్ర, ఇక ముందునకు జరుగవలసిన చరిత్ర ఉండుటనుబట్టి ఇది మనమందరము చదువవలసినది. ఇది సర్వజనుల గ్రంథము.

2. క్రీస్తుప్రభువు: ఈయన సర్వలోకభారము వహించిన దేవుడును, మనుష్యుడును గనుక సర్వజనుల రక్షకుడు.

3. క్రైస్తవమతము: ఇది సర్వజనులకు విద్యయందు, నాగరికతయందు, చేతిపనులయందు, శరీరవిషయములన్నిటియందు మేలుచేయ యత్నించుచున్నది. మరియు ప్రజలకు దైవభక్తియు క్రీస్తువలన కలుగు రక్షణమార్గమును మోక్షప్రవేశాంశములును బోధించుచున్నది. గనుక ఇది సర్వజనుల మతము.

దైవప్రార్థనచేయు విధము: (1) నీ గదిలో మోకరించి అన్నియు మరచిపోయి యేసుప్రభువును మాత్రమే తలంచుకొనుము. (2) నీ పాపములు ఒప్పుకొని క్షమాపణకోరుము. (3) నీవు పొందిన మేళ్ళు తలంచుకొని స్తుతించుము. (4) నీకవసరమైన అంశములు ఉదహరించుచు ప్రార్థించుము. (5) కొంతసేపు మౌనముగా కనిపెట్టుము. అప్పుడు దేవుడు నీ మనస్సులో మంచి తలంపులు పుట్టించును.

రక్షణ పిలుపు: 1. రండి– క్రీస్తునొద్దకు – సమస్తమైన వారలారా నాయొద్దకు రండి అని ఆయన చెప్పుచున్నాడు.

2. రండి – ఆయన బోధవినుటకు – నా యొద్ద నేర్చుకొనుడి అని ఆయన చెప్పుచున్నాడు.

3. రండి – మారుమనస్సు స్థితికి – మారుమనస్సు పొందండి అని ఆయన చెప్పుచున్నాడు.

4. రండి– పాపక్షమాపణ పొందుటకు – నీ పాపములు క్షమింపబడినవని ఆయన చెప్పుచున్నాడు.

5. రండి – నమ్ముటకు; రండి – బాప్తిస్మము పొందుటకు; రండి – రక్షణ పొందుటకు– నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును అని ఆయన చెప్పుచున్నాడు.

6. రండి– సమస్తమును పొందుటకు – అడుగుడి మీకియ్యబడునని ఆయన చెప్పుచున్నాడు.

7. రండి – మోక్షములో ప్రవేశించుటకు – ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపలేడు అని ఆయన చెప్పుచున్నాడు.

గుంటూరు సమీపమందలి కాకానివద్దనున్న శ్రీ రావుసాహెబ్ జె. రాజారావుగారి తోటలోని స్వస్థిశాలలో ప్రతి సోమవారము ప్రార్థన కూటములు జరుగుచున్నవి. అందునుబట్టి యేసుక్రీస్తు ప్రభువు రోగులను బాగుచేయుచున్నాడు. కొందరిలోని భూతములను వెళ్ళగొట్టుచున్నాడు. బిడ్డలు లేనివారికి బిడ్డలను అనుగ్రహించు చున్నాడు. కొందరికి దర్శనమిచ్చుచున్నాడు.

**బైబిలు మిషను:** ఇన్నిమతములుండగా ఎన్నో క్రైస్తవ మిషనులుండగా, ఎంతోమంది యోగ్యులుండగా, రాజమండ్రిలో 1938 సం॥న దేవుడు నాకు ఎందుకు “బైబిలు మిషను” అను అక్షరములు వ్రాసిచూపించి బైలుపరచెనో అదియు, “ఇదిపైకెత్తి చూపించుము” అని ఎందుకు చెప్పెనో లోకము, ఆయనను అడిగి తెలిసికొనవలసియున్నది. ఆలాగున బైబిలు మిషనును పైకెత్తి చూపించగల కృప ప్రభువు మనకు అనుగ్రహించునుగాక! ఆమేన్.

# 15. ప్రార్థనకోర్కె నెరవేర్చుకొను పద్ధతి

1. నీవు ఎవరి మనసు నొప్పించినావో, ఎవరికి వ్యతిరేకముగా ప్రవర్తించినావో వారియొద్ద నీ తప్పులు ఒప్పుకొన్నావా?

2. నీ తలంపులలో ఏదైన పొరపాటు ఉన్నదా?

3. నీ మాటలలో ఏదైన పొరపాటు ఉన్నదా?

4. నీయొక్క క్రియలలో, చేష్టలలో, ప్రయత్నములలో, నడతలో ఏదైన పొరపాటు ఉన్నదా? అవన్నియు క్రీస్తుప్రభువుయొద్ద ఒప్పుకొనవలెను.

5. నాకు తెలిసిన పొరపాటు చేయకుండ ఉండుటకు ప్రయత్నింతును అని ప్రమాణము చేయవలెను.

6. నేను క్రీస్తుప్రభువును ఆశ్రయించిన తర్వాత ఏ దేవతను, ఏ రక్షకుని ఆశ్రయింపను.

7. క్రీస్తుప్రభువు దేవుడు, మనిషైయున్నాడు గనుక ఆయనే నాకు మోక్షము ఇవ్వగలడు, నా జబ్బులు బాగుచేయగలడు. ఆయనే నా చిక్కులు విడదీయగలడని నమ్ముచున్నాను?

8. భయము, దిగులు, అధైర్యము, విసుగుదల, అపనమ్మిక, ప్రభువు ఇంకా నా మొర ఆలకింపలేదు అనే ప్రశ్న, నిరాశ, ప్రార్థన నెరవేరలేదు అను దుఃఖము ఈ మొదలైనవన్ని దయ్యములవంటివి గనుక వీటిని నీ మనసులోనికి చేరనియ్యకుము.

9. వంటగదిలోనికి ఈగలను, దోమలను, పెంపుడు జంతువులను, కుక్కలను, పిల్లులను, దూడలను, పక్షిజాతిలోచేరిన కోళ్ళను, పిచ్చుకలను వీటిని ఎవరు లోపలికి రానివ్వరో వారే వంటపని బాగా తెలిసినవారు. అప్పుడు వంట పనులన్నియు బాగా జరుగును.

అలాగే ప్రార్థన చేయువారు ఈగలవంటి పాడు తలంపులనుగాని, పెంపుడు కోళ్ళవంటి మంచి తలంపులనుగాని రానీయకూడదు. అట్టివారి ప్రార్థనలు బాగా ఉండును. నెరవేరును.

10. వంటపని ఇంకా బాగా తెలిసినవారు పాత్రలను, గృహమును, చేతులను, శరీరమును శుభ్రముగా నుంచుకొన్నయెడల వంటబాగుగా జరుగును. ఆలాగే ప్రార్థనలోనికి వెళ్ళకముందు మనము ఉదరము బాగా శుభ్రము చేసికొన్నయెడల అప్పుడు ప్రార్థన బాగా వచ్చును, నెరవేరును.

11. జీవరాసులను దయతో చూచుచున్నారా? వాటికి సరిగా మేతపెట్టక, నీరుపెట్టక అనవసరముగా కొట్టుట తప్పు. అదికూడ మానివేసిన ప్రార్థన నెరవేరును. యెరూషలేము దేవాలయములో యేసుప్రభువు బుద్ధిలేని మనుష్యులను తన బెదిరింపు మాటతో వెళ్ళగొట్టెను గాని, పశువులను కొరడాలతో కొట్టెనుగాని, పక్షులను తోలివేసెను. ఆయన ఏ మనుష్యుని కొట్టలేదు.

"అందుచేతను ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామని నమ్ముడి. అప్పుడు అవి మీకు కలుగునని మీతో చెప్పుచున్నాను" (మార్కు 11:24).

షరా: ఈ ప్రకారముగా చేసినయెడల మీ కోరికలన్నియు నెరవేరును.

ఆయన ఎవనిని గద్దించక అందరికిని ధారాళముగా దయచేయువాడు (యాకోబు 1:5) గనుక ఆయన మీ పరిపూర్ణ విశ్వాస ప్రార్థనా కోర్కెలను నెరవేర్చునుగాక! ఆమేన్.

Bible Mission HQ Guntur

# 16. జెకర్యా మూగతనము

యెరూషలేములో గుడి ఉన్నది దాని యందు ధూప వేదిక గలదు. అక్కడ జెకర్యాయను యాజకుడు దూపము వేయు చున్నాడు(లూకా 1:8-25). ఆయనకు అక్కడ దేవాలయములో గబ్రియేలుదూత కనబడి "నీకు కుమారుడు పుట్టును గొప్ప వాడగునని చెప్పెను". జెకర్యాయు తనభార్య ముసలివారగుటచే అనుమానము కలిగినది. అందుచేత "ఇది నాకు ఏలాగు తెలియునని" అడిగెను. తనకు కుమారుడు పుట్టునని ఏలాగు తెలియునని దూతను ప్రశ్నించెను. దేవునిదూత చెప్పుచున్నాడు గనుక ప్రశ్నవేయకూడదు, నమ్మవలెను, ఇంకా ప్రశ్నించుట ఎందుకు. ఇంకా ఎవరైన చెప్పితే నమ్మకూడదుగాని దూత చెప్పినప్పుడు ఎందుకు ఇంకా అపనమ్మిక? అతడు దూతమాట మనసులో నమ్మనందున ప్రశ్నవేసినాడు. వివరము తెసికొనుటకు అడుగవచ్చునుగాని అపనమ్మికతో అడుగకూడదు.

జెకర్యా వృద్ధాప్య కారణాన్ని ఎత్తుకుని ప్రశ్నించినాడు, దూతచెప్పినమాట నమ్మలేదు. అవిశ్వాసము చొప్పున అడిగినాడు. అవిశ్వాసముతో ఒక్కప్రశ్న వేసినను నేరమే. తెలిసికొనవలెనని వంద ప్రశ్నలు వేసినను నేరములేదు. కుమారుడు పుట్టునని సంతోషించక అవిశ్వాసమునుబట్టి ప్రశ్నవేసెను. ఆ ప్రశ్నకు పుట్టుకస్థానము అవిశ్వాసము, అనగా అవిశ్వాసమును బట్టి ప్రశ్న పుట్టినది. కాబట్టి అవిశ్వాసముతో ప్రశ్నలు వేయరాదు. వారికి కుమారుడు పుట్టుటకు ఆటంకము వృద్ధాప్యము. అట్టి ఆటంకము ఉన్నను దేవునిదూత

చెప్పినది గనుక నమ్మివేయవలెను. ఎన్ని ఆటంకములున్నను దేవునిమాటలు నెరవేరునని మనము నమ్మవలెను. జబ్బు ఎంతకాలమునుండి ఉన్నప్పటికిని, ఎంతపెద్ద జబ్బు అయినను బాగుపడుదునని నమ్మవలెను. జబ్బునుబట్టి కాదు, జబ్బుయొక్క ఉరవడినిబట్టికాదు గాని దేవుని వాగ్ధానమునుబట్టి నమ్మవలెను. దీర్ఘకాలవ్యాధి అని, వ్యాధి ముమ్మరముగా ఉన్న మనము కూడా నమ్మలేము గనుక జెకర్యాను నిందించనక్కరలేదు. మనము కూడా కష్టము ఎక్కువగుటను చూచి అవిశ్వాసులమగుదుము. జెకర్యా అనుభవశాలి ప్రార్ధనలో ఉన్నాడు, దేవాలయములో ఉన్నాడు. బయట ప్రార్థనా కూటము ఉన్నది. దేవదూత మాట విన్నాడు, దేవదూతను చూచినాడు. అయినను కుమారుడు పుట్టునను వార్త నమ్మలేదు. తాను నమ్మకుండుటకు ఒక్కటే ఆటంకము – వృద్ధాప్యము. పైవన్నీ మంచివే. అంత మంచి ఉన్నను ఒక్క ఆటంకము వలన అవిశ్వాసము కలిగినది. అట్టి బలహీనత భక్తులందరికి వచ్చును. *గనుక ఎంత మంచి ఉన్నను, ఏదైనను చిన్నలోటు ఉన్నయెడల అట్టి అవిశ్వాస స్థితి వచ్చును గనుక జాగ్రత్తగా ఉండవలెను.* మరియు జెకర్యా యాజకుడు, భార్య యాజక వంశస్తురాలు, దేవుని దృష్టిలో నీతిమంతులు, మరియు దూత వర్తమానములో భయపడవద్దు నీ ప్రార్థన వినబడినది ఇవన్నీ ఆయనను గురించి బైబిలులో వ్రాయబడిన మంచి వరుస, నమ్ముటకు వీలగువరుస (లూకా 1:5,6). వీటినిబట్టి అయినను నమ్మవలసినదిగాని నమ్మలేదు.

నమ్మలేకుండుటకు కారణములు (1) గొడ్రాలు (2) వృద్ధులు. వారిలో మంచి లక్షణములు అనేకములున్నను, నమ్మకము

కలిగించుటకు వీలగునవి అనేకములున్నను పై రెండు ఆటంకములనుబట్టి నమ్మలేకపోయెను. జెకర్యా నమ్మగలుగుటకు ఇంకా అనేక కారణములు గలవు. యాజకుడు, యాజక ధర్మము జరిగించుచున్నాడు. దేవుని గుడిలో నున్నాడు, దూపము వేయుచున్నాడు, బయట ప్రార్థన సమాజముగలదు, దూత కనబడుట, దూత మాట్లాడుట, భయపడవద్దని చెప్పుట, ప్రార్థన వినబడినదని చెప్పుట, కొడుకు పుట్టుననుట, అతడు ఆత్మపూర్ణుడై యుండుననుట, అతనిపని మొదటిరాకకు ప్రజలకు సిద్ధముచేయునని చెప్పుట, ఇంకా అనేకములు గలవు (లూకా 1:13,17). గాని రెండు ఆటంకములు ఎక్కువ నష్టము కలుగజేసినవి, నమ్మకుండా చేసినవి, అవిశ్వాసమునకు కారణమైనవి, ఆలాగే మనకును జరుగును. మనకు ధైర్యము కలిగించేవి అనేకములున్నను చిన్న పొరబాట్లు మనలోనున్న ఇట్టిస్థితి కలుగును. మనము దేవుని మాటలు నమ్ముటకు అనేక వాగ్దానములున్నవి. గాని మనలను అవిశ్వాసులనుగా చేయుటకు ఏ చిన్నవియైనను ఒకటి లేక రెండు చిన్న కారణములుండునని తెలిసికొనవలెను, జాగ్రత్తపడవలెను. అందుకే ఈ పాటము వ్రాయ బడెను. జెకర్యాయొక్క గ్రామముపేరు జట్ట అను గ్రామము. జెకర్యా పూజారి పని తనవంతుచేయుటకు యెరూషలేము వచ్చెను.

పూర్వము అబ్రాము, శారా అనువారు హెబ్రోను అనుపట్టణములోనుండగా దేవుడు వారిదగ్గరకు వెళ్ళి అబ్రహామా నీకు కుమారుడు జన్మించునని చెప్పెను. అప్పుడు ఆయనకు 100 యేండ్లు. దేవుడు చెప్పితే మాత్రము అబ్రాము నమ్మునా? గాని

నమ్మినాడు. అబ్రాహాము నవ్వితే దేవుడు కోపపడలేదుగాని, శారాకూడా నవ్వినది. అబ్రాహాము దేవునిమాట నమ్మి నవ్వినాడు, గాని శారా నమ్మక నవ్వినది. శారా డేరాచాటున నవ్వినది అలా నవ్వకూడదని చెప్పెను. శిక్షించలేదుగాని గద్దించినాడు. అబ్రాహాము నూరు ఏండ్లవాడు అయితే మాత్రము నమ్మినాడు. దేవునికి అసాధ్యమేమున్నది, దేవుడు సంతానము ఇవ్వగలడు. జెకర్యాతో దూత "నేను దేవునిఎదుట నిలువబడు గబ్రియేలును", నీతో మాట్లాడుటకును, నీకు ఈ మంచి కబురు చెప్పడానికిని దేవుడు నన్ను పంపెనని చెప్పి, నీవు *వాటిని నమ్మలేదు గనుక ఈ సంగతులు జరుగు దినము వరకు నీవు మూగవాడవై యుందువని* చెప్పెను.

అవిశ్వాసి యొక్క అవిశ్వాసమునకు రావలసిన దుష్ట ఫలితము జెకర్యాకు కలిగెను. యోహాను రాకడ, యేసుప్రభువు రాకడ జెకర్యా నమ్మలేదు. జెకర్యా–యోహాను రాక నమ్మనందున యేసు ప్రభువు రాకడకూడ నమ్మలేదని చెప్పవచ్చును. మన కాలములోని వారుకూడా యేసుప్రభువు యొక్క రెండవరాకడనుగూర్చి నమ్మకపోయిన వారికి వాక్కురాదు. రాకడనుగురించి చెప్పుమంటే ఎవరూ మాకు బోధించలేదు లేక మా పాదిరి మాకు బోధించలేదు, బోధించినా మాకు నమ్మకములేదు అని అంటారు. మీరు రాకడ నమ్మకపోతే మీకు రాకడను గురించి చెప్పుటకు వాక్కురాదు. ఇది వాక్కురాని మూగతనము. ఎవరు రాకడ నమ్ముదురో వారికి వాక్కు వచ్చును. ఎన్ని ప్రశ్నలు వచ్చినా ఋజువుచేసి నమ్మించగలరు. ఇప్పుడు నమ్మి, తర్వాత నమ్మకపోయిన వాక్కురాదు. జెకర్యా గుర్తులు చూపించెను. అలాగే

బయటివారు నమ్మకపోతే ఆకాశగుర్తులు చూపింతురుగాని చెప్పుటకు వాక్కురాదు. బైబిలు మిషనువారు రాకడగుర్తులు చెప్పుచున్నారు. ఇతరులు, మాకు నమ్మకములేదు గాని వారు చెప్పారు గనుక ఇవి రాకడ గుర్తులని చెప్పుదురు, గాని నేను రాకడను గురించి నమ్ముచున్నానని చివర చెప్పుదురు. ఆలాగు చెప్పుట కాదుగాని, "రాకడ నిజమే" అని చెప్పుటకు వాక్కు రావలెను. ఈ గుర్తులు రాకడకేనట అని చెప్పుదురు. ఇది రెండవరాకడకు ముందువచ్చు మూగతనము. ఇది ఒక సంజ్ఞ అనగా సూచన. మనకు ప్రభువు త్వరగా వస్తాడని.

గనుక ఇట్టి సంజ్ఞలు గుర్తించి రాకడకు చదువరులు సిద్ధపడుదురుగాక! ఆమెన్.

రెండవ రాకడ ముందువచ్చు వాక్కురాని మూగతనము తప్పించుకొనండి.

# 17. రక్షణ మహా సంకల్పన కథ

**నాస్తికుని మార్పుకథ:-** నాస్తికునికిని క్రైస్తవ బోధకునికిని జరిగినసంభాషణ.

నాస్తికుడు: మీరెప్పుడు దేవుడు దేవుడంటారు. దేవుని చూడని దానికెందుకనాలి, మీరెప్పుడైనా దేవుని చూచినారా?

బోధకుడు: దేవుడు ఉన్నాడని మేము చెప్పుచుండగా నమ్మని మీరు దేవుని చూచాము అని అంటే మాత్రము నమ్ముతారా ఏమి?

నాస్తికుడు: రుజువు పరిస్తే నమ్మకేమి, చూచాము అని అంటే ఎందుకు నమ్మను?

బోధకుడు: ఇప్పుడే మీకు బోధపరుస్తాను, నేను చెప్పినట్లు చేయండి (ఇద్దరు సరే సరే అనుకున్నారు).

నాస్తికుడు: ఏమి చేయమంటారు?

బోధకుడు: నేను మోకరిస్తాను, మీరుకూడ మోకరించండి.

నాస్తికుడు: ఎవరిఎదుట మోకరించడము.

బోధకుడు: దేవుని ఎదుట.

నాస్తికుడు: సరిసరిలే, దేవుడనేవాడు లేడు అంటూవుండగా, నన్ను దేవుని ఎదుట మోకరించుమంటారా? మహాబాగా ఉన్నది.

బోధకుడు: మీకు రుజువుకావలెనుగదా, మోకరించకపోతే రుజువు ఏలాగు దొరుకుతుంది (ఏలాగైతేనేమి చెప్పగా చెప్పగా అతడు మోకరించెను).

బోధకుడు: ఇప్పుడు కండ్లు మూసికొనండి.

నాస్తికుడు: ఇదిమరీ బాగున్నది. దేవుడున్నాడని నమ్మకములేనిదే కళ్ళు ఏలాగు మూసికొంటాను. మీ క్రైస్తవులు చేసినట్టు?

బోధకుడు: అయ్యా నేను చెప్పినట్టుచేయండి మీకేమి నష్టము లేదుగా. (తుదకు కళ్లుమూసుకోవడము వరకు వచ్చింది కథ) ఆ తర్వాత ఏమి జరిగినదంటారా?

బోధకుడు: అయ్యా నేను చెప్పేమాటలు మీరుకూడ చెప్పండి.

నాస్తికుడు: ఏమిమాటలేమిటవి?

బోధకుడు: దేవా! పాపినైన నన్ను కరుణించుము (అని నేర్పబోయెను).

నాస్తికుడు: మా బాగా చెప్పినారు, నేను అనను, దేవుడున్నాడని నాకు తోచడములేనిదే దేవా అని ఏలాగంటానయ్యా.

బోధకుడు: అయ్యా మీరీమాటలనండి, అంటేమీదేమి పోయింది, హానిలేదుగా, దేవుడుంటే తప్పక బయలుపడును, లేకపోతే లేనేలేదు, ఉంటే మీకే స్వయముగా తెలుస్తుంది. లేకపోతే తగాదాలేదు అప్పుడు అనడము మానివేయవచ్చును.

నాస్తికుడు: సరే అంటానులెండి, ఆ మాట తిరిగి చెప్పండి. (అప్పుడేమి జరిగిందోవినండి) "దేవా పాపినైన నన్ను కనికరించుము" అని బోధకుడు అనుచుండగా ఒకదరినుంచి నాస్తికుడు అనుచుండెను.

ఆ మాటలే అనగా అనగా ఆ మాటలు నాస్తికుని మనస్సులో నాటుకొని పోవుచుండెను? ఆ మాటలమీద అతనికి ఇష్టము

కలుగుచున్నది. తర్వాత ఏమి జరిగినది? బోధకుడు అనడము అవసరము లేకుండ ఆ నాస్తికుడు స్వయముగా అనడము మొదలుపెట్టెను. తనకుతానే కొంతసేపు అనినతర్వాత అతనిలో వణుకు పుట్టినది. ఎందుకనగా, అప్పటికే దేవుడున్నాడను నమ్మకము అతనిలో పుట్టెను. ఉన్న దేవునిని లేడు లేడు అన్నానుగదా ఇన్నాళ్ళనుంచి అని విచారము కూడ అతని మనసులో కలిగెను. అప్పుడా నాస్తికుడు దేవా! పాపినైన నన్ను కనికరించుము అని పెద్దకేకవేసెను, ఏడ్చెను, కంటనీరు పెట్టెను. నేలమీద పడినాడు. చూచినారా! ప్రయత్నముచేయగా నిజము తెలిసినది, ప్రార్థనచేయగా నిజము బైలుపడినది. ఇష్టములేని ప్రార్థనచేసిన చివరకు ఇష్టము కలిగినది. శాస్త్రములు చదివిన బోధపడని సంగతి ఒకరోజున కొన్ని నిమిషములు ప్రార్థనచేయగా బోధపడినది.

కాబట్టి ప్రియులారా మీరును ఆలాగే చేయండి. మా బోధ నిజమో కాదో పరీక్షించడానికి ప్రార్థన చేయండి. ఇదివరకే దైవభక్తి విషయములు మీకు వచ్చియున్న ఆ అంశమును గురించి ప్రార్థించ నక్కరలేదు. గాని దేవుడే మననిమిత్తమై నరుడై యేసుక్రీస్తు అను పేరు పెట్టుకొనెను. ఆయననే పూజించిన మోక్షమని క్రైస్తవులు చెప్పుబోధ మీకు నచ్చకపోతే ప్రార్థనచేయండి. నిజము మీకు తెలియును. దేవుడైన ఆ క్రీస్తే మరల రెండవసారి మేఘముమీద వస్తారు. నమ్మినవారిని మేఘముమీద ఎక్కించుకొని మోక్షలోకమునకు తీసికొని వెళ్ళుదురు. కాబట్టి ఆఖరుమాట– దేవుడనే ఒకాయన

ఉన్నాడనీ, ఆ దేవుడు మనలను రక్షించుటకు మనిషై జన్మించినాడని, యేసుక్రీస్తు అనుపేరు పెట్టుకొన్నాడని, ఆయనను నమ్ముకొన్న మోక్షమని, ఆయనే ఇప్పుడు బహుత్వరలో వచ్చుచున్నాడని మీకు అర్థము కాకపోయిన ప్రార్థించండి, అప్పుడు మీకు అర్ధమగును చేస్తారా! నాస్తికుడు చేసినాడుగదా! మీరు చేయలేరా, చేయండి. అట్లుచేయగల శక్తి దేవుడు మీకు అనుగ్రహించునుగాక! ఆమేన్.

# 18. సంస్కార ప్రసంగము

లూకా 22:14-23; కీర్త. 23:5; 1కొరిం. 11:23-31

"లుబెక్" అనునది ఒకపేరు. చాలామందికి తెలిసేయుండును. ముఖ్యముగా బడిలో చదివినవారికి తెలిసేయుండును. ఇది జర్మనీ దేశములో ఉన్న ఒక పట్టణము. ఒకసారి వారు తమ ప్రాంతములోని భూమిని త్రవ్వుచుండగా పెద్దరాయి దొరికినది. దానిపై అక్షరములుగల వాక్యాలు చెక్కబడి ఉన్నవి. అవేవనగా యేసుప్రభువు ప్రజలకు చెప్పిన మాట ఆయన బోధ ఆయనను గురించి ఇదివరకు ఎవరికి వినబడి ఉన్నదో వారికే ఆ మాటలు చెందియున్నవి. అది విన్న వారిలో విశ్వాసులు + అవిశ్వాసులు ఉండవచ్చునుగాని, ఆ రాతిమీద మాటలు మిక్కిలి బలహీనముగా ఉన్నవారికే.

1. యేసుప్రభువు విశ్వాసులందరికి చెప్పునదేమనగా:- ఆ మాటలు నాలుగు సువార్తలకు చెందినవి. అక్కడక్కడున్న సంగతులు ఎత్తి సూచాయిగా వ్రాసిన మాటలు. ఇదొక చిన్న ప్రసంగముగా పొందుపర్చి ఎవరో ఆ రాతిమీద చెక్కివేసెను. వారు భూమిలోనుండి త్రవ్విన రాయి కడిగి చదువగా:-

(1) మీరు నన్ను బోధకుడు అని అంటున్నారు. అదేమి పిలుపు? బోధకుడా అని అంటు ఉన్నారు, అని పిలుస్తు ఉన్నారు. నిజమే నేను బోధకుడనే గాని నా మాట మీరు వినరు గనుక బోధకుడనని నన్ను పిలిస్తే లాభమేమి? నా మాట మీరు విననప్పుడు?

(2) నేను మార్గమైయున్నానని మీరు అంటున్నారు. ఔను నేను (యోహాను 14:6) చెప్పినానుగా! నేనే మార్గమునని, గనుక

మీరు నా మాటలే అంటున్నారు. నేను పరలోకమునకు మార్గమునేగాని నా మార్గమున మీరు నడువరు. మీరు నా మార్గమున నడవనప్పుడు మీరు నన్ను పొగడిన సంతోషమేమి?

(3) నేను జీవమైయున్నానని మీరంటున్నారు. నిజమే జీవాన్నే. నేను జీవమైయున్నానని నేనేగదా మీకు చెప్పింది (యోహాను 14:6) నేను జీవమైయున్నానని మీరంటున్నారు గాని మీరు నన్ను కోరుకొనరు.

(4) నేను మహా సౌందర్యవంతుడనని నా ప్రవర్తనను బట్టి మీరంటున్నారు ఔను. నిజముగానే సౌందర్యవంతుడను గాని మీరు నన్ను ప్రేమించరు. గనుక నేను సౌందర్యవంతుడనని మీరు అంటున్నందువల్ల నాకేమి సంతోషము?

(5) ప్రభువా! అని నన్ను ప్రార్థనలో పిలుస్తున్నారు. ఔను నేను మీకు ప్రభువునే, యజమానుడనే, మీకధికారినే. అయితే ప్రయోజనమేమి? మీరు నాకు విధేయులు కావడములేదు. ప్రభువా! అని మీరు నన్ను అన్నంత మాత్రమున నేను మురుసుకుంటున్నానా? నాకు మీరు విధేయులై యుండడములేదు. ప్రభువా! ప్రభువా! అని నన్ను పిలిచేవారు గాదు. నా తండ్రి చిత్తప్రకారము చేయువాడు సంసిద్ధులని నేను చెప్పలేదా?

కాబట్టి ప్రియులారా! మీరు నాకు మంచిమంచి బిరుదులు పెట్టి పిలుస్తున్నారేగాని ఆ ప్రకారము మీరు నడుచుటలేదు. అట్లు మీరు నడిచినంత మాత్రమున నాకు సంతోషములేదు. ఆ రాతిమీద వ్రాసిన మాటలలో నేను చెప్పినవి కొన్ని ఇదిగో మన అందరియెదుట బల్లయు, దానిపై రొట్టె ద్రాక్షారసమును ఉన్నది. అయితే మీరు వచ్చి ఈ రొట్టెను మీరు తీసికొన్నపుడు నేను చూస్తాను. అంతమాత్రమున నాకు సంతోషములేదు. దానితోపాటు నేనిచ్చు

శరీరం పుచ్చుకొంటే నాకు సంతోషముగాని వట్టి రొట్టె తీసికొంటే నాకు సంతోషములేదు. అట్టివారు నేటి దినాలలో చాలామంది ఉన్నారు. ఆలాగే ద్రాక్షారసంతోపాటు నేనిచ్చు రక్తం తీసుకుంటేనే నాకు సంతోషమని చెప్పను. మీరు వచ్చి రొట్టె + ద్రాక్షారసము, శరీరము + రక్తం తీసికొంటే నాకు అపరిమిత సంతోషము కలుగును, కలుగుచున్నది. ఈ వేళ బల్లదగ్గరకు వచ్చువారు కనబడే ఈ రెండు, కనబడని ఆ రెండు, మొత్తము నాలుగు తీసికొనేటందుకే ప్రభువు ఏర్పాటు చేస్తున్నారు. రొట్టె, ద్రాక్షారసము తీసికొనవలెనంటే బజారులోనే అది తిని త్రాగవచ్చును.

నన్ను జ్ఞాపకము చేసికొనుటకు తిని త్రాగండని ప్రభువే చెప్పెను. అయితే రొట్టెను జ్ఞాపకము చేసికొనండనిగాని ద్రాక్షారసము శరీరము, రక్తము జ్ఞాపకము చేసికొనండనిగాని చెప్పలేదు. గాని నన్ను జ్ఞాపకము చేసికొనండని చెప్పెను. (లూకా 22:19) ఆ "నన్ను" అనుమాటలోనే శరీరం, రక్తము, రొట్టె, ద్రాక్షారసం ఉన్నది. ఆ నాల్గింటిలో మొత్తము ఆయనే ఉన్నారు. యేసుప్రభువును గూర్చి ఒకమాట వ్రాయబడెను. "నేను నా స్వకీయులయొద్దకురాగా వారంగీకరించలేదు" నన్ను అనుటలో సగంగాదు కాని, పూర్తిగానే నన్ను వెంబడించలేదని నన్ను వెంబడించండి అనగా సగంకాదు. పూర్తిగానే వెంబడించాలి. బైబిలులోని యెరూషలేము దేవాలయములో ప్రభువు కానుకపెట్టెవద్ద కూర్చుండగా సంఘదృష్టిలో చాలామంది వచ్చిరిగాని, ఆయన దృష్టిలో అనేకమంది సున్నా అయిపోయిరి. అనగా ఆయన దృష్టిలో కొద్దిమంది. ఒక విధవరాలు ముఖ్యురాలు, విధవరాలు వేసినది ముఖ్యకానుక. గొప్ప వారిచ్చినదికాదు. ఆలాగే

బల్లయొద్దకు 50మంది రావచ్చును గాని అది పాదిరిగారి లెక్కగాని, ప్రభువు లెక్కలో అదికాదు. ఎవరైతే మనస్ఫూర్తిగా ఆలాగు తీసికొంటారో వారే ఆయన లెక్కలోని వారు. ప్రభువు కాదు రమ్మని పిలుచుట. మనస్సు పూర్తిగా వచ్చువారినే రమ్మని పిలుచుచు రమ్మంటున్నారు. విధవరాలు 2 కాసులు స్వల్పమేగాని ప్రభువు దృష్టిలో ఆమె రెండు కాసులు గొప్పవి. లూబెక్ పట్టణంలో దొరికిన రాయి మీద వ్రాతలో ప్రభువు ఎట్టి ఆలాపన చూపినాడో అట్టి ఆలాపనతోనే ప్రభువు ఇక్కడ బల్లవద్ద నిలబడియున్నారు. ఆ నాలుగు పుచ్చుకొన్న వారితో అనేకమంది రారు. వారు పుచ్చుకోరు. వచ్చిన రానిలెక్కలోనివారే. ఎందుకంటే పరిసయ్యులు వచ్చి వందలువేసిన మంచి మనుష్యులుకారు గనుక వారురారు, వారు సంపూర్ణ కానుక వేయరు అన్నట్టే ఇక్కడ అర్థము.

**ఉదా:-** రాజు విందు చేసెనని బైబిలులో ఉన్నది. రాజు విందుకు పిలువబడినవారు రాజు విందుచేసినారా? లేదు. పిలిచినవారు రానందున సేవకులను పంపి గొందులలోనివారిని పిలుచుకొని రమ్మనెను (మత్తయి 22:1-10) సంస్కారము తెలిసి రానివారికిని, వచ్చి సిద్ధపడని వారికిని ఈ ఆట నేను సిద్ధపర్చినాను గాని వారు రారని ప్రభువు చెప్పుచున్నారు. అదేలోకములో జరుగుచున్నది. విందులోనికి వస్తానన్నవారేరారు. ప్రభువు కూడా చెప్పేది ఈ మాటే. వారు రారు.

ఈ కొద్దిమాటలు దేవుడు దీవించి బల్లయొద్దకు రాగల స్థితి మీకనుగ్రహించునుగాక! ఆమేన్.

# 19. యత్న యంత్రము

ఒకరిలో భేదాభిప్రాయమగుపడగా కలహింపక సలహా ఇచ్చుట గొప్ప జ్ఞానము.

దేశీయులైన ప్రియులారా! మీకు శుభము. మా సలహా: 1. క్రీస్తును ప్రార్థించి చూడండి. కీడు తొలగును. మేలు కలుగును. మోక్షలోక నివాసము దొరుకును. దేవుడు మన నిమిత్తమై నరుడుగా కన్యకగర్భమున జన్మించెను. ఆయనే యేసుక్రీస్తు. ఆయన ధర్మములు బోధించెను. ఆ ప్రకారముగా ఆయనే నడిచి చూపించెను. అద్భుతరీతిగా యెన్నోమేళ్ళు చేసెను. లోకపాపములు తనమీద వేసికొన్నందున ఘోరమరణము పొందవలసి వచ్చెను. ఐనను బ్రతికివచ్చి మోక్షలోకమునకు వెళ్ళెను. మిగుల త్వరలో మేఘవాహనుడై వచ్చి భక్తులను ప్రాణముతో మోక్షమునకు తీసికొనివెళ్ళును. గనుకనే ఆయనను ప్రార్థించండని చెప్పుచున్నాము. క్రీస్తుపేరుమీద క్రైస్తవ మతము స్థాపితమాయెను. అది క్రీస్తువలె పాపులకు, రోగులకు, బీదలకు, బిడ్డలు లేనివారికి, భూతపీడితులకు, ఆయా అవస్థలలో నున్నవారికి మేలుచేయుచున్నది. ఇట్టిపని నేటికిని గుంటూరు సమీపముననున్న కాకానియొద్ద క్రీస్తువలన ప్రతిసోమవారము జరుగుచున్నది. ఇక్కడ కొందరికి ఆయన కనబడి వారితో మాట్లాడుచున్నాడు.

2. బైబిలు చదివిచూడండి. దేవుడు మనకు చెప్పవలసినవి దీనిలోగలవు. ఇది ఆయన లోకమునకు పంపిన ఉత్తరము.

3. తెలిసిన క్రైస్తవులతో సంభాషించి చూడండి. అప్పుడు మీ అనుభవజ్ఞానము వృద్ధిపొందును.

4. ఈ మూడును మీకిష్టము లేనియెడల ఈ దిగువనున్న ప్రార్ధనవంటి ప్రార్ధనచేసి చూడండి. దేవా! అన్నిటిని అందరిని, నన్నును, కలుగజేసిన తండ్రీ! నాకు కనబడుము. అందరికిని కనబడుము. నాతో మాటలాడుము. అందరితోను మాటలాడుము.

5. ఇదికూడ మీకిష్టము లేనప్పుడు నిశ్శబ్దముగా నున్న ఏకాంతస్థలములోనుండి మీకు ఉపయోగకరమైన విషయములను గురించి ఆలోచించిచూడండి. అప్పుడు మీకు సంతోషము కలిగింపగల మంచి మంచి తలంపులు వచ్చును.

సదాకాలము మీతో కూడా ఉన్నానని చెప్పిన క్రీసు యేసు వారి కృప చదువరులకెల్లరకు తోడైయుండును గాక! ఆమెన్.

Bible Mission HQ Guntur

గుంటూరు నందు:

ప్రథమ ముద్రణ 2006 ప్రతులు 5000

ఇది దేవుడు యం. దేవదాసు అయ్యగారికి బయలుపరచిన

**బైబిలు మిషను ప్రచురణ**

బైబిలు మిషను ప్రెస్ - పెదకాకాని, 522 509.

ఫోన్ : 2556644; 2556149.

Bible Mission HQ Guntur